

భక్తజనుల వాడా..గోవిందా!



వాడపల్లి వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు బ్రహ్మాండంగా సాగుతున్నాయి.. పెద్ద ఎత్తున భక్తజనం హాజరై స్వామిని దర్శించుకుంటున్నారు.. 6

సోమవారం రాత్రి యోగనారసింహ అలంకరణలో శ్రీవారు ముస్తాబై సింహ వాహనాన్ని అధిరోహించి తిరువీధుల్లో విహరించారు. వాహన సేవలో పాల్గొన్న భక్తులు గోవిందా.. గోవింద అంటూ నామస్మరణ చేశారు. విద్యుత్‌కాంతుల మధ్య ఊరేగింపు అంగరంగ వైభవంగా సాగింది.

'టెన్త్'లో జిల్లాను ప్రథమస్థానంలో నిలపాలి

» ప్రణాళికాబద్ధంగా కార్యాచరణ రూపొందించాలి: డీఈవో



సబ్జెక్టు ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో సలీంబాషా

అమలాపురం రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పదోతరగతి పరీక్షల్లో గతేడాది కోనసీమ జిల్లా రాష్ట్రస్థాయిలో ద్వితీయస్థానంలో నిలిచింది. వచ్చేఏడాది ప్రథమస్థానంలో నిలిచేలా ఇప్పటి నుంచే విద్యార్థులను ప్రణాళికాబద్ధంగా సన్నద్ధం చేయాలని డీఈవో డాక్టర్ షేక్ సలీంబాషా సూచించారు. అమలాపురం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం సబ్జెక్టు ఎక్స్‌పర్ట్‌లతో డీసీఈబీ కార్యదర్శి బీర హనుమంతరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. డీఈవో సలీంబాషా, సమగ్రశిక్ష అసిస్టెంట్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి.మమ్మి ముఖ్యఅతిథులుగా హాజరై గతేడాది ఫలితాలను వివరిస్తూ మరింత మెరుగైన ఫలితాలను సాధించేదిశగా ప్రణాళిక ఉండాలన్నారు. ప్రధానంగా సీ, డీ గ్రేడ్ విద్యార్థులను, ఏ, బీ గ్రేడ్ విద్యార్థులతో సమానంగా రాణించేలా ప్రయత్నించాలని సూచించారు. ప్రతి విద్యార్థి పదోతరగతిలో ఉత్తీర్ణత సాధించేలా స్టడీ మెటీరియల్ రూపొందించాలన్నారు.జిల్లాస్థాయిలో సబ్జెక్టు ఎక్స్‌పర్ట్ ఇచ్చే స్టడీ మెటీరియల్ అదనంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. డీసీఈబీ కార్యదర్శి హనుమంతరావు మాట్లాడుతూ పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు సమయం ఆసన్నం అవుతున్నందున ఇప్పటినుంచే ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ,ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో 18వేలమంది విద్యార్థులు జిల్లానుంచి పదో తరగతి పరీక్షలకు హాజరు కానున్నట్టు తెలిపారు. సమావేశంలో జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఈశ్వరరావు, సమగ్రశిక్ష ఏఎంవో బొరుసు వీవీ సుబ్రహ్మణ్యం, ఏఎంవో జి.రాంబాబు, జీసీడీవో డాక్టర్ ఎంఏకే భీమారావు పాల్గొన్నారు.



పవన్.. పనిలో దిగారు!

వ్యర్థాల సంద్రమై..

కాకినాడ సెజ్ పరిధిలో తొండంగి మండలంలో అరబిందో సంస్థ లైఫియస్ ఫార్మా కంపెనీని 2024లో ప్రారంభించింది. రూ.2,500 కోట్ల పెట్టుబడితో ఏటా 15 వేల మెట్రిక్ టన్నుల పెన్సిలిన్, 1.80 లక్షల మెట్రిక్ టన్నుల గ్లూకోజ్ ఉత్పత్తి చేసే సామర్థ్యంతో కంపెనీ స్థాపించింది. ప్రస్తుతం ఏడాదికి 15 శాతం మాత్రమే ఉత్పత్తి చేస్తోంది.ఈ క్రమంలో విడుదలయ్యే ఫార్మా వ్యర్థజలాలను సముద్రంలోకి విడిచిపెడుతోంది. ఇందుకు 11 మీటర్ల అడుగులో సముద్రంలో పైపులైన్‌ను 2.3 కిలో మీటర్ల మేర నిర్మించింది. అక్కడ ఈ వ్యర్థ జలాలను సముద్రంలో కలుపు తోంది. దివిస్ తొండంగిలో రూ.1,200 కోట్లతో ఫార్మా కంపెనీ నిర్మించింది. ఈ సంస్థ కూడా ఫార్మా ఉత్పత్తుల వ్యర్థ జలాలను 1.3 కిలోమీటర్ల మేర సముద్రంలో పైపులైన్ నిర్మించి వదులుతోంది.

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

» అరబిందో,దివిస్ ఫార్మావ్యర్థం..తేల్చేద్దాం
» కాలుష్యంపై ఏపీపీసీబీ అధ్యయనం
» ఉప్పాడ మత్స్యకారులకు పవన్ హామీ
» అధికారుల ఉరుకులు..పరుగులు
» నీరి,నియో, ఏయూలతో చర్చలు
» మూడు కన్సల్టెంట్లతో సంప్రదింపులు
» ఫార్మా వ్యర్థజలాల నమూనాల సేకరణ

అరబిందో,దివిస్ ఫార్మా వ్యర్థ జలాలతో సముద్ర జలాలు ఏ స్థాయిలో కలుషితం అవుతున్నాయో తేల్చడానికి అధికారులు కసరత్తు ప్రారంభించారు. తీరం నుంచి ఎంత వరకు సముద్ర జలాల్లో రసాయనాలు కలుస్తున్నాయనేది నిగ్గు తేల్చబోతున్నారు.సముద్ర కాలుష్యంపై వంద రోజుల్లో సమస్య పరిష్కారానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఉప్పాడ మత్స్యకారులను ఇటీవల గడువు కోరిన నేపథ్యంలో అధికారులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు.ఏపీపీసీబీ అధికారులు స్వతంత్ర సంస్థలను రంగంలోకి దించబోతున్నారు.ఈ మేరకు దేశంలోనే పేరున్న నీరి,నియో, ఏయూ నిపుణులతో మాట్లాడుతున్నారు. సముద్రంలో కలిసే కాలుష్యాన్ని నిగ్గు తేల్చడంతో ఈ మూడింటికి మంచి పేరుంది. వీటిలో ఎవరికి బాధ్యతలు ఇవ్వనున్నారనేది త్వరలో తేలనుంది.

పవన్ వచ్చారు.. హామీ ఇచ్చారు..

అరబిందో, దివిస్ కంపెనీలు సముద్రంలో 2.3 కిలోమీటర్లమేర పైపులైన్లు నిర్మించి ఫార్మా వ్యర్థాలను నీటిలో వదులుతున్నాయి. దీంతో తమకు వేట దొరకడం లేదని ఉప్పాడ మత్స్యకారులు ఆందోళన చేస్తు న్నారు. తమకు పరిహారం ఇప్పించాలని కోరుతూ గత నెల 23 నుంచి కొన్ని రోజుల పాటు ఆందో ళనకు దిగారు. జిల్లా కలెక్టర్ చర్చలకు వెళ్లినా డిప్యూటీ సీఎం పవన్ వచ్చి తమ సమస్యలను వినాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో గురువారం పవన్ కల్యాణ్ కాకినాడ కలెక్టరేట్‌లో మత్స్యకార సంఘాలతో చర్చించారు. అదే రోజు సాయంత్రం ఉప్పాడ సభలో ప్రసంగించారు. సముద్రంలో ఫార్మా వ్యర్థ జలాల కాలుష్యంపై ఆడిట్ నిర్వహిస్తామని వంద రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పవన్ శనివారం అమరావతిలో పీసీబీ అధికారులు, జిల్లా కలెక్టర్‌తోను చర్చించారు. అసలు సముద్రంలో ఫార్మా వ్యర్థ జలాలు ఏ మేరకు కలుస్తున్నాయి? కాలుష్య ప్రభావం ఎంత? మత్స్యకారుల వేటపై ప్రభావం చూపుతుందా? లేదా? అనే దానిపై అధ్యయనం చేయించే విషయమై చర్చించారు. దేశంలో ప్రముఖ సంస్థలతో ఈ పని చేయించాలని తేల్చారు. నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (నీరి), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ, ఆంధ్రా యూనివర్సిటీ మెరైన్ లివింగ్ రిసోర్స్ విభాగం వీటిలో ఎవరైతే మేలనే దానిపై చర్చించారు.ఈ మూడింటి వద్ద సముద్ర కాలుష్యంపై అధ్యయనం చేసే సాంకేతికత ఉందని అధికారులు పవన్‌కు వివరించారు.ఈ మూడింటితోను అధికారులు ప్రస్తుతం చర్చలు జరుపుతున్నారు. త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

నిర్ధారణ.. ఒక సవాల్..

సముద్రంలో ఫార్మా వ్యర్థ జలాల కాలుష్యం ఏ స్థాయిలో ఉందనేది నిర్ధారించడం కష్టంతో కూడుకున్న పని.ఫార్మా వ్యర్థ జలాల ప్రభావం సముద్రంలో ఎలా ఉందనేది తేల్చడానికి కంపెనీ సముద్రంలో నిర్మించిన పైపులైన్‌గుండా ప్రత్యేకమైన రంగుతో కూడిన రసాయనం విడు దల చేస్తుంది. పైపులైన్ ముగిసిన ప్రదేశంలో వ్యర్థజలాలు నీటిలో కలిసేచోట శాంపిళ్లు సేకరి స్తుంది.ఈ వ్యర్థ జలాలు విడుదలైన చోటు నుంచి 250 మీటర్ల వరకు శాంపిళ్లు తీసుకుం టుంది. ఈ విష జలాల వల్ల చనిపోతున్న మత్స్యసంపదకు సంబంధించి వాటి అవశేషా లను పరీక్షిస్తుంది. ఒకరకంగా చెప్పాలంటే సముద్రంలో ఫార్మా వ్యర్థజలాలు కలిసిపోయిన తర్వాత అవి విస్తరించి చాలా సూక్ష్మస్థాయిలో రసాయనాలు విడిపోతాయి. వీటిని సూక్ష్మ స్థాయిలో పరిశీలించాల్సి ఉంటుంది. అరబిందో, దివిస్ ఫార్మా కంపెనీలు విడుదల చేస్తున్న వ్యర్థ జలాలను కంపెనీల్లో తనిఖీలు నిర్వహించి పరి శీలిస్తారు. వీటికి సంబంధించి ప్రాథమిక నివేదిక తయారు చేసిన తర్వాత ఏయే రకాల రసాయనాలు సముద్రంలో కలుస్తున్నాయి? వాటి ప్రభావం చేపలవేటపై ఎలా ఉంటుంది? ఎంత మేర సముద్రజలాలపై విస్తరించి ప్రభావం చూపుతున్నాయి? వంటి కోణాల్లో విశ్లేషించనున్నారు. కాలుష్య ప్రభావం నిర్ధారించే బాధ్యతలను అప్పగించేందుకు ఆయా సంస్థల ను అధికారులు నేరుగా కలిసి వివరించేందుకు పీసీబీ అధికారులు సమాయత్తమవుతున్నారు. సముద్రంలో ఫార్మా వ్యర్థ జలాల కాలుష్యం నిజమేనని తేలితే నష్టపోతున్న మత్స్యకారులకు వేట పరిహారం ఇప్పించే అంశం..అటు కంపెనీల లోపాలను దిద్దుబాటు చేసే అంశంపై ఎలా వ్యవహరించాలనే దానిపై అధికారులు సమాలోచనలు చేస్తున్నారు.

17న రాజోలులో..

డిప్యూటీ సీఎం పవన్ పర్యటన

» ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష
» అధికారులకు బాధ్యతల అప్పగింత
» సమీక్షలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ ఎమ్మెల్యే



ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే, జేసీలు

అమలాపురం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఈనెల 17న రాజోలు నియోజకవర్గంలో పర్యటించనున్న నేపథ్యంలో పల్లెపండుగ 2.0 పనులపై సోమవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. డిప్యూటీ సీఎం పవన్ పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్ మహేష్‌కుమార్ అధ్యక్షతన ప్రాథమిక స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. రాజోలు ఎమ్మెల్యే దేవవరప్రసాద్, జేసీ టి.నిషాంతి, ఎస్పీ రాహుల్‌మీనా, డీఆర్వో కె.మాధవిలతోపాటు జిల్లాస్థాయిలో వివిధ ప్రభుత్వశాఖలకు చెందిన అధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఉపముఖ్యమంత్రి హోదాలో రాజోలు వస్తున్నందున పక్కాగా పర్యటన ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

శంకరగుప్తం మురికికాల్వ విధ్వంసం కారణంగా 15 గ్రామాల్లో ఉప్పునీరు పైకి రావడం, డ్రైనేజీ పూడిక తీయకపోవడంతో అరకిలోమీటరు పొడవున డ్రైనేజీ నీరు పైకి పొంగి కొబ్బరిచెట్లు వేలాదిగా చనిపోయి రైతులకు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్న దృష్ట్యా చేపట్టే చర్యలపై సమీక్షించారు. శంకరగుప్తం డ్రెయిన్‌ను జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఇటీవల సందర్శించి రూ.9కోట్లు మంజూరు చేస్తానని, గట్టు బలోపేతానికి రూ.6కోట్లు నిధులు విడుదల చేస్తానని ఇచ్చిన హామీ నేపథ్యంలో శంకరగుప్తం డ్రెయిన్ సమస్యపై పవన్‌కల్యాణ్‌తో చర్చించామని ఎమ్మెల్యే దేవవరప్రసాద్ తెలిపారు. స్వయంగా పరిశీలనకు రావాలని చేసిన ఆహ్వానంపై ఆయన వస్తున్నట్టు తెలిపారు. పల్లెపండుగ 2.0 పనులను ప్రారంభించేందుకు సీఎస్సార్ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నరేగా అనుసంధానంతో చేపట్టే పనులకు పవన్ శంకుస్థాపన చేస్తారని వెల్లడించారు. తొలుత కేశనపల్లి వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుని బ్రిడ్జి వ్యూ పాయింట్ నుంచి చెట్లు దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించిన అనంతరం 200మంది రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించి తర్వాత ప్రెస్‌మీట్ నిర్వహిస్తారన్నారు. అనంతరం మలికిపల్లి సెంటర్‌కు చేరుకుని కాత్రేనిపాడులంక వద్ద ఏడు గ్రామాలకు రోడ్డు నిర్మాణానికి రూ.3.20కోట్లతో శంకుస్థాపన చేస్తారని, నరేగా అనుసంధానంతో జిల్లా కలెక్టర్ ప్రతిపాదించిన పనులకు శంకుస్థాపన, భూమిపూజ కార్యక్రమాలు నిర్వహిస్తారు. రూ.3.4 కోట్లతో గుడిమెళ్లంక రాపిడ్ పిల్లర్, ఎన్జీటీ నిధులతో రూ.7.5కోట్లతో ఓహెచ్ఎస్సార్ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. పల్లె పండుగ 2.0లో పూర్తి చేసిన 117 పనులను ప్రారంభించనున్నారు. ఆర్‌అండ్‌బీ ద్వారా రూ.7కోట్లతో చేపట్టే ఆరు పనులకు పవన్ శంకుస్థాపన చేస్తారు. అనంతరం శివకోడు జాతీయ రహదారి చెంతన వేలమందితో ఏర్పాటు చేసే బహిరంగసభలో పవన్‌కల్యాణ్ పాల్గొని ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ రామచంద్రపురం ఆర్డీవో కేశనపల్లి హెలిప్యాడ్ వద్ద, కొత్తపేట ఆర్డీవో వేదిక ఏర్పాట్లు, ఎస్పీ బహిరంగ వేదిక వద్ద శాంతిభద్రతల పర్యవేక్షణ చేస్తారని అమలాపురం ఆర్డీవో కార్యక్రమం పర్యవేక్షించాలని ఆదేశించారు. విద్యుత్‌శాఖ అధికారులు సరఫరాకు ఏర్పాట్లు చేయాలని, వేదిక వద్ద తాగునీటిని ఆర్‌డబ్ల్యుఎస్ చేపట్టాలని, కాన్వాయ్ ఏర్పాట్లను అదనపు ఎస్పీ, జిల్లా రవాణాధికారులు చేయాలని, సీపీవో నివేదిక తయారు చేయాలని, మీడియా కోఆర్డినేషన్‌ను జిల్లా పౌరసమాచారశాఖ అధికారి చూడాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయాలి

» రైతులు గిట్టుబాటు ధర పొందండి
» పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్, జేసీ



కలెక్టరేట్‌లో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జేసీ

అమలాపురం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి):ఖరీఫ్ సీజన్‌లో రైతుసేవాకేంద్రాల ద్వారా కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించి రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరించాలని కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశించారు.గిట్టుబాటు ధర కల్పించాలన్న డిమాండ్‌ను నెరవేర్చుకోవాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోలుకు సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ మహేష్‌కుమార్, జేసీ నిషాంతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూరైతులు ఇ-పంటకు ఈకేవైసీ చేయాలని, పంటకోతల తేదీల ఆధారంగా కూపన్లు జారీ చేస్తారని, ధాన్యం విక్రయించాల్సిన పరిమాణం, వివిధ రకాల ధాన్యంవివరాలను నమోదుచేసి అందించాలని సూచించారు. జేసీ నిషాంతి మాట్లాడుతూ పరీక్షించిన నమూనాలు నిబంధనల మేరకు ఎఫ్ఏక్యూ ప్రమాణాలకు అనుగుణంగా వరినాణ్యతను మెరుగుపరిచేలా రైతులకు సలహాలు ఇవ్వడం, తదనుగుణంగా షెడ్యూల్ చేయడం ద్వారా ధాన్యం విక్రయాలు చేపట్టాలని సూచించారు. రైతుల సంఖ్య చెల్లించిన మొత్తంతో కూడిన సమాచారం రైతు సేవా కేంద్రం వద్ద ప్రదర్శించేలా చూడాలన్నారు. సాగుక్షేత్రాలను సందర్శించి ధాన్యం నమూనాలను సేకరించాలన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో ఇబ్బందులుంటే టోల్‌ఫ్రీ నెంబరు 1967 లేదా కంట్రోల్ రూం నెంబరు 8309432487, 9441692275లను సంప్రదించి సమస్యలు పరిష్కరించుకోవచ్చునన్నారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి అడపా ఉదయభాస్కర్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్రీడా పోటీలకు అంబాజీపేట విద్యార్థుల ఎంపిక 6



'పీజీఆర్ఎస్'లో 110 అర్జీలు

అమలాపురంటౌన్,అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): అర్జీదారులపట్ల అధికారులు మర్యాదగా ప్రవర్తిస్తూ వారిసమస్యలకు సంతృప్తికర పరిష్కార మార్గాలు చూపాలని కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో జేసీ టి.నిషాంతి, జిల్లా రెవెన్యూఅధికారి కె.మాధవి, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్‌లతో కలిసి కలెక్టర్ అర్జీలను స్వీకరించారు.జిల్లాలోని వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన వారినుంచి 110అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏపీసీ జి.మమ్మి, డీఈవో షేక్ సలీంబాషా, జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ ఏవీఎస్ రామన్, పీఎస్వో ఎ.ఉదయభాస్కర్, జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు, జిల్లా పశుసంవర్ధకశాఖఅధికారి వెంకట్రావు,ఎల్డీఎం కేశవవర్మ, ఆర్అండ్‌బీ ఎస్ఈ బి.రాము, డీఎఫ్‌వో ఎంవీవీ ప్రసాదరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీనివాసరావు, వికాసా జిల్లా మేనేజర్ గోళ్ల రమేష్ పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో..

అమలాపురంటౌన్, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి):జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎస్పీ రాహుల్ మీనా ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 20మంది నుంచి అర్జీదారులు ఆయన స్వయంగా స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే పోలీసు అధికారులతో మాట్లాడి సమస్యలను విచారించి పరిష్కరించాలన్నారు. నిర్ణీత సమయంలో ఆయా ఫిర్యాదులను విచారించి జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదిక రూపంలో అందించాలన్నారు.






స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు మహా స్నపనం నిర్వహిస్తున్న అర్చకులు, కల్యాణోత్సవంలో భాగంగా తలంబ్రాలు పోస్తున్న దృశ్యం

యోగ నారసింహుడై... సింహవాహనారూఢుడై



- వాడపల్లిలో శాస్త్రోక్తంగా మహా స్నపనం
- శ్రీభూ సమేత శ్రీవేంకటేశ్వరస్వామికి జగత్ కల్యాణం
- నాలుగో రోజుకు శ్రీవారి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు
- గోవిందనామస్మరణతో మార్మోగిన కోనసీమ తిరుమల



ఆత్రేయపురం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లిలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు నాల్గవ రోజుకు చేరుకున్నాయి. సోమవారం ఉదయం స్వామివారి ఉత్సవ మూర్తులను వసంత మండపంలో కొలువుదీర్చారు. వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఖండవల్లి రాజేశ్వరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేద పండితులు, అర్చకులు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అష్టకలశారాధన, మహా స్నపనం, ప్రధాన హోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. లోక కల్యాణార్థం శ్రీనివాసుని కల్యాణం రమణీయంగా జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టు వస్త్రాలను చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు సమర్పించారు.

సాయంత్రం స్వస్తి వాచనం, ప్రధాన హోమాలు, విశేష అర్చన, చతుర్వేద స్వస్తి జరిపారు. మహారాష్ట్ర కళాకారుల వాయిద్యాలు, మహిళల కోలాటం, కర్రసాము ప్రదర్శనలు భక్తులను ఊర్రుతలూగించాయి. రాత్రి యోగనారసింహ అలంకరణలో శ్రీవారు ముస్తాబై సింహ వాహనాన్ని అధిరోహించి తిరువీధుల్లో విహరించారు. వాహన సేవలో పాల్గొన్న భక్తులు స్వామివారి అనుగ్రహం పొందారు.




స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చైర్మన్, ఉప కమిషనరు దంపతులు... వేంకటేశ్వరస్వామి, దేవేరుల అలంకారాల్లో కళాకారులు




ఆకట్టుకున్న మహారాష్ట్ర కళాకారుల వాయిద్యాలు, మహిళల కోలాట ప్రదర్శన



అందాల కొండ... మేఘాలు నిండా...

ఉదయం, సాయంత్రం వేళల్లో పొగ మంచు... అప్పుడప్పుడు చిరుజల్లులు... మన్యంలో ఇలా భిన్నమైన వాతావరణం మనసుకు హాయి గొలుపుతుంది. పచ్చని పొలాలు ఒకవైపు... కొండలపై నుంచి మేఘాలు తేలియాడుతున్నట్టు మరోవైపు... ఇలా మంచు సోయగాలు పర్యాటకులను అబ్బురపరుస్తున్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా మోతుగూడెం-డొంకరాయి మార్గమధ్యంలో సోమవారం 'ఆంధ్రజ్యోతి'కి చిక్కిన మంచు మనోహర దృశ్యమిది.

- మోతుగూడెం (ఆంధ్రజ్యోతి)



ప్రతిభాన్వేషణ

కౌశల్ రాష్ట్ర స్థాయి సైన్స్ క్విజ్ పోటీలు-2025 షెడ్యూల్ విడుదల



అమలాపురం రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల ప్రతిభా పాటవాలు, సైన్స్ పరిజ్ఞానాన్ని వెలికితీసేందుకు కౌశల్ క్విజ్ పోటీలు దోహదపడతాయి. భారతీయ విజ్ఞాన మండలి, అప్‌కాస్ట్ సైన్స్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. కౌశల్ రాష్ట్ర స్థాయి సైన్స్ ప్రతిభాన్వేషణ పోటీలు-2025 షెడ్యూల్‌ను విడుదల చేశారు. నవంబరు 1 నుంచి పాఠశాల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నాలుగు విభాగాలుగా జరిగే పోటీల్లో అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చు. జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు విజేతలకు నగదు బహుమతులు అందజేస్తారు.

పాఠశాల స్థాయి పరీక్షలు ఇలా...

పాఠశాల స్థాయిలో క్విజ్ పోటీలను 8, 9, 10 తరగతుల విద్యార్థులకు నిర్వహిస్తారు. వారిలో ఒక్కో తరగతికి ముగ్గురు విద్యార్థులను మాత్రమే ఎంపిక చేయాలి. రీల్ పోటీలకు పదో తరగతి విద్యార్థులు మాత్రమే అర్హులు. పోస్టర్ కాంపిటీషన్-1 పోటీలను 9వ తరగతి విద్యార్థులకు నిర్వహించి ఇద్దరిని మాత్రమే ఎంపిక చేయాలి. పోస్టర్ కాంపిటీషన్-2 పోటీలను 8వ తరగతి విద్యార్థులకు నిర్వహించి ఇద్దరిని ఎంపిక చేయాలి. క్విజ్, రీల్ కాంపిటీషన్, పోస్టర్ కాంపిటీషన్‌లో పాల్గొనే విద్యార్థులకు స్కూల్ లెవెల్‌లోనే ఆన్‌లైన్ పరీక్ష రాయాల్సి ఉంటుంది. క్విజ్ పోటీలకు ఎస్‌సీఈఆర్టీ సిలబస్ అక్టోబరు వరకు ఉంటుంది. రీల్ పోటీలకు ఇండియన్ కాంట్రిబ్యూషన్ టు సైన్స్ వెబ్‌సైట్, పోస్టర్ కాంపిటీషన్ పోటీలకు భారత దర్శన్ మెటీరియల్ వినియోగించుకోవాలి. పాఠశాల స్థాయిలో నిర్వహించే పరీక్షలో ప్రతి తరగతి నుంచి క్విజ్‌కు 20 మంది, రీల్‌కు 20 మంది, పోస్టర్-1కు 20 మంది, పోస్టర్-2కు 20 మంది చొప్పున జిల్లా స్థాయి పోటీలకు ఫైనల్‌గా ఎంపిక చేస్తారు. నవంబరు 1, 3, 4 తేదీల్లో స్కూల్ లెవెల్ పరీక్షలు నిర్వహిస్తారు.

జిల్లా స్థాయిలోను ఆన్‌లైన్ పరీక్ష...

జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులకు ఆన్‌లైన్‌లో పరీక్షనిర్వహిస్తారు. వారిలో రాష్ట్ర స్థాయికి ప్రతి జిల్లా నుంచి క్విజ్ పోటీలకు 8, 9, 10 తరగతుల నుంచి ఇద్దరేసి విద్యార్థులు పాల్గొంటారు. రీల్ కాంపిటీషన్‌కు పదో తరగతి విద్యార్థులు ఇద్దరు, పోస్టర్ కాంపిటీషన్-1కు 9వ తరగతి విద్యార్థులు ఇద్దరు, పోస్టర్ కాంపిటీషన్-2కు 8వ తరగతి విద్యార్థులు ఇద్దరు ఎంపికవుతారు. ఇలా ప్రతి జిల్లా నుంచి విద్యార్థులను ఎంపిక చేయాల్సి ఉంటుంది. 8, 9 తరగతుల విద్యార్థులకు నవంబరు 27న, పదో తరగతి విద్యార్థులకు నవంబరు 28న పరీక్షలు జరుగుతాయి.

రాష్ట్ర స్థాయిలో ముఖాముఖి పోటీలు

ఎం.సూర్యనారాయణ, జిల్లా స్థాయి పరీక్షల నిర్వహణాధికారి



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు ఆయా విభాగాల్లో ముఖాముఖి పోటీలు నిర్వహిస్తారు. డిసెంబరు 27న తిరుపతిలో జరిగే భారతీయ విజ్ఞాన జాతీయ సమ్మేళనంలో ఈ పోటీలు నిర్వహిస్తారు. జిల్లా స్థాయి విజేతలకు ప్రథమ బహుమతి రూ.4,500, ద్వితీయ బహుమతిగా రూ.3వేలు, రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమ బహుమతి రూ.15వేలు, ద్వితీయ బహుమతి రూ.12వేలు, తృతీయ బహుమతి రూ.9వేలతో పాటు రూ.6వేలు చొప్పున కన్సొలేషన్ బహుమతులను ఆయా విభాగాల్లో అందజేస్తారు. అర్హులైన విద్యార్థులంతా కౌశల్ పోటీల్లో పాల్గొనాలి.

జాతీయ క్రీడా పోటీలకు అంబాజీపేట విద్యార్థులు



జాతీయ పోటీలకు ఎంపికైన అంబాజీపేట విద్యార్థులు

అంబాజీపేట, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో అంబాజీపేటకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు తైక్వాండో సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు తెలిపారు. ఈ నెల10 నుంచి 12వరకు బాపట్ల జిల్లా పేటేరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో స్కూల్ గేమ్స్‌లో 20కిలోల విభాగంలో కుడుపూడి కావ్య సుందరి హరిప్రియ ప్రథమ, 24 కిలోల విభాగంలో యెరుబండి ఇషానాగశ్రీనిజ ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో కనబరిచిన విద్యార్థులు పంజాబ్‌లో జరిగే జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొంటారని కోచ్ త్రిమూర్తులు తెలిపారు.

జాతీయ షూటింగ్‌బాల్ పోటీలకు నీలిమ

ముమ్మిడివరం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కర్నూలులో ఇటీవల నిర్వహించిన ఏపీ ఇంటర్ డిస్ట్రిక్ట్ షూటింగ్‌బాల్ చాంపియన్‌షిప్‌లో ముమ్మిడివరం శ్రీబాలాజీ కాన్వెంట్‌లో పదో తరగతి చదువుతున్న యనమదల నీలిమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. నవంబరు 7,9తేదీల్లో జరిగే జాతీయ పోటీల్లో ఆమె పాల్గొనున్నట్టు హెచ్‌ఎం పీవీ రామరాజు తెలిపారు. నీలిమను కాన్వెంట్ కరస్పాండెంట్ పి.సుజాత, వ్యవస్థాపక అధ్యక్షుడు వీవీఎస్ శాస్త్రి, ఉపాధ్యాయులు అభినందించారు.



నీలిమను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు తేజశ్రీ ఎంపిక



బిక్కవోలు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పందలపాక ఉన్నత పాఠశాలకు చెందిన పి.తేజశ్రీ అండర్-19 రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్‌కు ఎంపికయ్యిందని హెచ్‌ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం పెదపూడి మండలం గొల్లల మామిడాడలోని ఫ్యామిలీ హెల్త్‌క్లబ్‌లో జరిగిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అండర్-19 బాలికల పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం చెప్పారు. ఈ సందర్భంగా తేజశ్రీని, తర్ఫీదు నిచ్చిన పీడీ యువరాజారెడ్డిని హెచ్‌ఎంతో పాటు పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కోనాల సత్తిరాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

తైక్వాండోలో రాష్ట్రస్థాయికి శశిరేఖ

రాజోలు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): తాటిపాక వేద జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోన్న యెరుబండి లక్ష్మీశశిరేఖ తైక్వాండో రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించిందని వేద విద్యా సంస్థల సెక్రటరీ ఏవీఎస్ఎస్ రవికుమార్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బాపన్న లక్ష్మీశశిరేఖకు శాలువా కప్పి సన్మానించారు. లక్ష్మీశశిరేఖను సెక్రటరీ రవికుమార్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.సోమేశ్వరరావు, ఏవో రామరాజు, నాన్ అడకమిక్ డైరెక్టర్ కంచి సూర్యనారాయణ అభినందించారు.



శశిరేఖను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

రేపటి నుంచి నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులు

కాకినాడ సిటీ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం వాకలపూడిలోని డీడీయూజీకేవై సెంటర్‌లో బుధవారం నుంచి నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని వికాస పీడీ కె.లచ్చారావు వెల్లడించారు. ఈ శిక్షణకు టెన్త్, ఇంటర్, డిగ్రీ, డిప్లమో ఉత్తీర్ణులైన 18 నుంచి 30 ఏళ్లలోపు పురుష అభ్యర్థులు అర్హులన్నారు. వేర్‌హౌస్ ఎగ్జిక్యూటివ్ కోర్సుకు 3 నెలల శిక్షణ ఇచ్చి ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగం కల్పిస్తారన్నారు.శిక్షణ అనంతరం కేంద్ర ప్రభుత్వ ద్వారా సర్టిఫికెట్ ఇవ్వనున్నట్టు చెప్పారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతి, యూనిఫారమ్, స్టడీ మెటీరియల్ అందిస్తారన్నారు. ఈ కోర్సుతో పాటు బేసిక్ కంప్యూటర్ కోర్సు, కమ్యూనికేషన్,ఇంటర్వ్యూ స్కిల్స్ పై శిక్షణ ఇస్తారన్నారు. ఆసక్తి ఉన్న వారు సెల్ నెంబర్లు 83284 83297, 89784 75164లో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

సామర్లకోట భీమేశ్వర ఆలయంలో సుప్రీంకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ పూజలు



భీమేశ్వరాలయంలో పూజలు నిర్వహిస్తున్న జస్టిస్ రమణ దంపతులు

సామర్లకోట/పిఠాపురం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్‌వీ రమణ సతీసమేతంగా సోమవారం రాత్రి సామర్లకోట కుమారరామ భీమే శ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించా రు. ఆలయానికి చేరుకున్న ఎన్‌వీ రమణ దంప తులకు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కంటే జగదీష్‌మోహన్(బాబు) ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. ఆలయంలోని అన్ని ఉపాలయాల దేవతామూర్తులను దర్శించిన రమణ దంపతులు ముందుగా భీమేశ్వరునికి, బాలాత్రిపుర సుందరిదేవికి విశేష పూజలు నిర్వహించారు. పండితులు వేదాశీర్వాదంతో ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాలను అందజేశారు. ఈ సందర్భంగా వారి వెంట జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి సునీత గంధం, కాకినాడ జిల్లా నాలుగో జూనియర్ జడ్జి నిరుపభాంజ్, డిప్యూటీ తహశీల్దార్ వై.శ్రీనివాసు, సీఐ కృష్ణభగవాన్ తదితర ఆలయాధికారులు పాల్గొన్నారు. అలాగే జస్టిస్ ఎన్‌వీ రమణ దంపతులు పిఠాపురంలోని పాదగయ క్షేత్రాన్ని సందర్శించారు. కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయ స్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. వేదపండితులు క్షేత్రప్రాశస్త్యాన్ని వివరించి ఆశీర్వచనాలు పలికారు. ఈవో కాట్నం జగన్మోహన శ్రీని వాస్ శేషవస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాలను అందజేశారు.

18 మంది యాచకులకు నేర చరిత్ర: ఎస్పీ



యాచకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

రాజమహేంద్రవరం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి 18 మంది యాచకులకు నేర చరిత్ర ఉన్నట్టు గుర్తించామని.. తగు దర్యాప్తు అనంతరం చర్యలు తీసుకుంటామని ఎస్పీ నర సింహ కిషోర్ పేర్కొన్నారు. కొంతమంది యాచకులు ఎక్కడ పడితే అక్కడ మద్యం తాగడం తోపాటు నేరాలకు పాల్పడుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీంతో రానున్న పుష్కరాల దృష్ట్యా ఆదివారం రాత్రి ప్రత్యేక సోదాలు చేశామన్నారు. దీంట్లో 193 మందిని గుర్తించామని, వారిలో 18 మందికి నేర చరిత్ర ఉందన్నారు. మిగతా వాళ్లను కౌన్సెలింగ్ చేసి స్వగ్రామాలను పంపించామని చెప్పారు. ఈ డ్రైవ్‌ని కొనసాగిస్తామని ఎస్పీ పేర్కొన్నారు.

కె రాంప్.. వినోదాత్మక చిత్రం

హీరో కిరణ్ అబ్బవరం



సమావేశంలో మాట్లాడుతున్న హీరో కిరణ్

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): అన్ని హంగులున్న వినోదాత్మక చిత్రం కె రాంప్ అని ఆ సినిమా హీరో కిరణ్ అబ్బవరం అన్నారు. సినిమా ప్రమోషన్‌లో భాగంగా సోమవారం రాజమహేంద్రవరం వచ్చిన ఆయన స్థానిక హోటల్ షెల్టాన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ ఈ నెల 18న దీపావళి కానుకగా ప్రపంచ వ్యాప్తంగా కె రాంప్ సినిమా విడుదలఅవుతుందన్నారు. హాస్య మూవీస్ పతాకంపై జైన్స్ నాని దర్శకత్వంలో రాజేష్ దండా నిర్మించిన కె రాంప్ సినిమా ఆద్యంతం స్పీడుగా నడుస్తుందన్నారు.ఈ సిని మా టీజర్, ట్రైలర్‌కు మంచి స్పందన వచ్చిందన్నారు. ఈ సినిమాలో యుక్తి తరేజా, నరేష్, సాయికుమార్, ఆలీ, వెన్నెల కిషోర్, అజయ్ అనన్య తదితరులు నటించిన కె రాంప్ సినిమా మాస్ కామెడీ ఎంటర్ టైనర్‌గా అన్ని వర్గాలను ఆకట్టుకుటుందని కిరణ్ అన్నారు. బాలయ్య సాంగ్‌తో ఎంట్రీ ఉంటుందన్నారు. పండగ సీజన్ కావడంతో కుటుంబ సమేతంగా వీక్షించాలనుకునే వాళ్లు కచ్చితంగా ఈ సినిమాకు వస్తారనే నమ్మకం ఉందన్నారు. సినిమాటో గ్రఫీ సతీష్ రెడ్డి, ఎడిటర్ చోటా కె.ప్రసాద్, సంగీతం చైతన్ భరద్వాజ్‌లు సినిమాకి మంచి రెస్పాన్స్ తెచ్చారని చెప్పారు. భవిష్యత్తులో తనకు ఘటోత్కచుడు వంటి పాత్రలతో సినిమాలు చేయాలని ఉందని కిరణ్ అన్నారు.

జయలక్ష్మి బ్యాంకు బాధితులను ఆదుకోవాలి

కలెక్టరేట్‌లో నిరసన.. సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన కలెక్టర్



కలెక్టరేట్‌లో నిరసన చేపట్టిన బ్యాంకు బాధితులు

కలెక్టరేట్ (కాకినాడ), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): జయలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు బాధితులను ఆదుకోవాలని కాకినాడ కలెక్టరేట్‌లో బాధితులు సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బాధితుడు ఈరంకి రఘుభూషణ్ మాట్లాడుతూ జయలక్ష్మి బ్యాంకు కుంభకోణంలో రూ.600 కోట్లు మాయం చేశారన్నారు. దీని వల్ల 19 వేల మంది బాధితులు రోడ్డున పడ్డారన్నారు.ఇప్పటి వరకు 90మంది బాధితులు వివిధ ఆరోగ్య సమస్యలతో మృతిచెందారని ఆవేదన వ్యక్తంచేశారు. పైగా ఇప్పుడు జయలక్ష్మి ప్రస్తుత బోర్డు త్రినాథ్‌రావు ఆధ్వర్యంలో కూడా రూ.3.77 కోట్లు బాధితుల సొమ్ము దుర్వినియోగమైందని ఆరోపించారు. బాధితుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ బోర్డును రద్దు చేసి కొత్తబోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. అనంతరం కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈనేపథ్యంలో సెక్షన్ 29 ప్రకారం బోర్డు డైరెక్టర్లపై విచారణకు ఆదేశించామని కలెక్టర్ పేర్కొన్నారన్నారు.అలాగే రాజమహేంద్రవరం నుంచి 50 సంతకాలతో ఇచ్చిన అవిశ్వాస తీర్మానం అందిన మరో 25 రోజుల్లో ప్రత్యేక సర్వజన మహాసభ పెడతామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.కార్యక్రమంలో బాధితులు బదరి నారాయణ, కస్తూరి రవికుమార్, వీఎస్‌వీ సుబ్బారావు, ప్రభాకర్‌రావు, బేగం, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఇన్ఫినిటమ్ కాంపిటీషన్‌లో 'ఆదిత్య' విద్యార్థుల ప్రతిభ



సంస్థ ప్రతినిధుల నుంచి బహుమతి అందుకుంటున్న విద్యార్థులు

కాకినాడ రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కాలికట్‌లోని నిట్ సంస్థ ఈ ఏడాది నిర్వహించిన ఇన్ఫినిటమ్ కాంపిటీషన్‌లో కాకినాడ జిల్లా కాకినాడ రూరల్‌లోని గంగరాజునగర్ ఆదిత్య పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచారని ప్రిన్సిపాల్ జె.మొయినా తెలిపారు.పదో తరగతి విద్యార్థులు ఎంజే సమర్థ,ఎం.సాయి అభినవ్ రూ.25వేల నగదు బహుమతిని చెక్కు రూపంలో నిట్ ప్రతినిధుల నుంచి అందుకున్నారు. వారిని ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి, డైరెక్టర్ ఎన్.దీపక్‌రెడ్డి అభినందించారు.

ఏజెన్సీలో భారీ వర్షం

నీట మునిగిన పత్తి పంట
రంగు మారుతుందని రైతుల్లో ఆందోళన



రాయనపేటలో పత్తితోటలో నిలిచిన వరదనీరు

ఎటపాక, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావంతో సోమవారం ఎటపాక ఏజెన్సీలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ఈ వర్షం ప్రస్తుత పంటలకు కొంత ఖేదం... కొంత మోదంగా మారిందని రైతులు పేర్కొంటున్నారు. అయితే ఇప్పటికే సాగైన వరి, మిర్చి పంటలకు వర్షం మేలు చేసినప్పటికీ, మరోవైపు చేతికొచ్చిన పత్తిపంట కొంత మేర దెబ్బతిన నుంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఎటపాక మండలంలో 5,324 ఎకరాల్లో పత్తి పంట, 3,124 ఎకరాల్లో వరిపంట సాగు చేశారు. మొన్నటి వరకు పలు పర్యాయాలు వచ్చిన గోదావరి వరదల ధాటికి మిర్చి, వరి పంటలు దెబ్బతిన్నాయి.కాస్త పత్తి పంట బాగుందని భావించారు. ఇప్పటికే కాయ పగిలి పత్తిపంట చేతికొచ్చే దశలో ఉంది. వర్షం వల్ల కాయరంగు మారి, పంటమీద ఉన్న పత్తి రంగు మారిపోతుందని ఆందోళన చెందుతున్నారు. కాగా వర్షం ధాటికిపత్తి తోటల్లో వరదనీరు నిలిచింది.దీంతో కొందరు రైతులు నీటిని బయటకు మళ్లించారు.

ముంచిన వాన

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలుచోట్ల సోమవారం భారీ వర్షం కురిసింది. దీంతో రహదారులు జలమయమై చిన్నపాటి చెరువులను తలపించాయి. ఆ దృశ్యాలే ఇవి


పిఠాపురంలో జలాశయాన్ని తలపిస్తున్న మార్గాలు


కాకినాడ ప్రధాన రహదారిపై వర్షం నీరు


పిఠాపురం మండలం విరవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద నిలిచిపోయిన నీరు






రాజమహేంద్రవరంలో మునిగిన రోడ్లపై వాహనదారుల పాట్లు

నిలిచిన పాపికొండల పర్యాటకం

వర్షాల కారణంగా రాని పర్యాటకులు


పోశమ్మగండి బోటు పాయింట్ వద్ద నిలిచి ఉన్న బోట్లు

దేవీపట్నం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పాపికొండలు పర్యాటకానికి టిక్కెట్ల కొనుగోలు లేకపోవడంతో నిలిచింది. గోదావరి వరదల కారణంగా గత 3నెలల నుంచి పాపికొండలు విహారయాత్రకు బ్రేక్ పడింది. అయితే ఇటీవల గోదావరి తగ్గుముఖం పట్టడంతో 2 రోజుల క్రితం పాపికొండలు పర్యాటకానికి అధికారులు పచ్చజెండా ఊపారు. ప్రస్తుతం వర్షాల కారణంగా పర్యాటకులు పాపికొండలు పర్యాటకానికి ముందుకురాకపోవడంతో బోట్లన్నీ బోటు పాయింట్ వద్దే నిలిచిపోయాయి.

బాణసంచా సామగ్రి నిల్వల స్వాధీనం

తయారీదారుడి అరెస్ట్

తాళ్లరేవు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం సుంకరపాలెంలో బాణసంచా తయారీ కేంద్రాలపై కోరింగ ఎస్ఐ పి.సత్యనారాయణ సోమవారం తమ బృందంతో దాడులు నిర్వహించారు. సుంకరపాలెం తోటవారివీధికి చెందిన ఏడిద వీరవెంకట సత్యనారాయణను అక్రమంగా బాణసంచా సామగ్రి నిల్వలను ఉంచినట్టు గుర్తించి స్వాధీనం చేసుకుని అతడిని అరెస్ట్ చేశారు. అనుమతులు లేకుండా నిర్వహించే బాణసంచా తయారీ కేంద్రాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సత్యనారాయణ హెచ్చరించారు.

నూరుశాతం ఉద్యోగాలు ఆదివాసీలకే ఇవ్వాలి

చింతూరులో ఆదివాసీ నిరుద్యోగుల భారీ ర్యాలీ... జోరు వర్షంలోను ఐటీడీఏ ముట్టడి

చింతూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మన్యంలో నూటికి నూరుశాతం ఉద్యోగ అవకాశాలు స్థానిక ఆదివాసీలకే కేటాయించాలని ఆదివాసీలు డిమాండ్ చేశారు. సోమవారం చింతూరులో భారీ వర్షంలోను ర్యాలీగా ఐటీడీఏ వద్దకు చేరుకుని ముట్టడించారు. కొద్దిరోజులుగా ఆదివాసీ నిరుద్యోగులు మండలంలోని ఆదివాసీ గ్రామాలు పర్యటించి జీవో నెం.3 తొలగింపుతో ఆదివాసీ నిరుద్యోగులకు జరిగిన నష్టంపై వివరించారు. అదేదశలో తమ డిమాండ్లు సాధించుకోవడానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సి ఉందని నిరుద్యోగులు ఊరూరా పర్యటించి సమావేశాలు, సభలు నిర్వహించి ఆదివాసీలకు అవగాహన కల్పించారు. ఈ మేరకు సోమవారం ఐటీడీఏ ముట్టడి కార్యక్రమానికి ప్రతి ఆదివాసీ స్వచ్ఛందంగా తరలిరావాలని కోరగా పలు ఆదివాసీ సంఘాలు మద్దతునిచ్చాయి. జోరున వర్షం కురుస్తున్నా వెనకడుగు వేయకుండా ర్యాలీ, ముట్టడి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఆదివాసీ నాయకులు మన్యంలో నూటికి నూరు శాతం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఆదివాసీ యువతకే కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రత్యేక డీఎస్సీ నిర్వహించి మన్యంలో స్థానిక ఆదివాసీలకే అవకాశం కల్పించాలని, మన్యంలో గిరిజనేతరుల అక్రమ కట్టడాలను కూల్చివేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ నాయకులు మడివి నెహ్రూ, అప్పల నర్స్, సీసం సురేష్, జల్లి నరేష్, కుంజా శ్రీను, ఉయిక రాంప్రసాద్, కారం సాయిబాబు, పొడియం రామకృష్ణ, మడివిరాజు పాల్గొన్నారు.




చింతూరులో వర్షంలోను ర్యాలీగా వెళ్లి ఐటీడీఏను ముట్టడించిన ఆదివాసీలు

బైక్ అదుపుతప్పి కళాశాల రికార్డు అసిస్టెంట్ మృతి


శ్రీనివాస్ (ఫైల్)

అనపర్తి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా అనపర్తి మండలం కొప్పవరంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న వేమగిరి గ్రామానికి చెందిన మట్టపర్తి శ్రీనివాస్(52) మృతి చెందాడు. వేమగిరికి చెందిన శ్రీనివాస్ రాయవరంలోని జూనియర్ కళాశాలలో రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. రోజు వేమగిరి నుంచి మోటార్ సైకిల్‌పై రాయవరం వచ్చి విధులు నిర్వహించుకుని వేమగిరికి వెళ్తుంటాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం ఇంటి నుంచి బయలుదేరిన శ్రీనివాస్ కొప్పవరం వచ్చేసరికి బైక్ అదుపుతప్పి పడిపోయాడు. దీంతో తీవ్రగాయాల పాలైన శ్రీనివాస్‌ను గమనించిన స్థానికులు అతడి ఫోన్ ద్వారా స్నేహితులకు సమాచారం అందించి చికిత్స కోసం అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీనివాస్ కొద్దిసేపటికే మృతిచెందాడు. ఈ ప్రమాదంపై శ్రీనివాస్ భార్య పద్మావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్టు ట్రైనీ ఎస్ఐ సుజాత పేర్కొన్నారు.

గిరిజనులకు సత్యదీక్షా వస్త్రాల అందజేత


గిరిజనులకు దీక్షా వస్త్రాలను ఉచితంగా అందజేస్తున్న ఈవో

అన్నవరం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల్లో హిందూధర్మప్రచారంలో భాగంగా ఈనెల 17నుంచి సత్యదీక్షలు ప్రారంభంకానున్న నేపథ్యంలో గిరిజన ప్రాంతాల్లో ఆసక్తి ఉన్న భక్తులతో సత్యదీక్షలు వేయించాలని నిర్ణయించారు. దీనిలో భాగంగా సోమవారం అడ్డతీగల మండలంలో పవనగిరి స్వామీజీ ఆధ్వర్యంలో సుమారు 600మందికి ఉచితంగా సత్యదీక్ష వస్త్రాలు, దీక్షామాలలను ఈవో సుబ్బారావు దేవస్థానం తరుపున అందజేశారు. 11 గిరిజన మండలాల్లో వీటిని అందజేయగా మిగిలినవారికి అవసరమైతే అందజేస్తామని ఈవో పేర్కొన్నారు.

అన్నవరం దేవస్థానంలో సంప్రోక్షణ ప్రారంభం

● వరుస వివాదాల నేపథ్యంలో నిర్వహణ ● మూడురోజుల పాటు కార్యక్రమాలు


సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధి వివిధ అంశాలపై ఇటీవల వరుస వివాదాలతో సతమతమవుతున్న నేపథ్యంలో నివారణా చర్యల్లో భాగంగా లోక కల్యాణార్థం దేవస్థానం వైదికకమిటీ సూచనల మేరకు సంప్రోక్షణ కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయంచడంతో సోమవారం ఉదయం నుంచి దర్బారు మండపంలో ప్రారంభమయ్యాయి. ఉదయం 8.56 నిమిషాలకు గణపతిపూజ, పుణ్యాహావచనం, పంచగవ్యప్రాశన, రుత్విక్‌వరుణలు, మంటపారాధనలు నిర్వహించారు. కల్యాణబ్రహ్మ చామర్తి వెంకటిరెడ్డి, ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పాలంకి చినపట్టాభి, విజెడి శర్మ నిర్వహించారు. ఈనెల 15న ఉదయం 11గంటలకు పూర్ణాహుతితో ముగుస్తాయి. శ్రీమత్రిపాద్వి భూతి మహావైకుంఠ నారాయణోపనిషత్ పారాయణలు, హోమాది వైదిక కార్యక్రమాలు నిర్వహిస్తామని దేవస్థానం పండితులు పేర్కొన్నారు. ప్రధానాలయాల్లో ఏటా ఏదొక యజ్ఞయాగాదులు జరుగుతుంటుండగా అన్నవరం దేవస్థానంలో సైతం నిర్వహించేవారు. అయితే గత రెండేళ్లుగా ఏ యజ్ఞయాగాది క్రతువులు నిర్వహించలేకపోయారు. తిరుమలలో సైతం ఏటా పవిత్రోత్సవాలు నిర్వహిస్తుంటారు. వరుస వివాదాల నేపథ్యంలో పండితుల సూచనల మేరకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి


నరసింహరాజు మృతదేహం

గోకవరం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటనపై గోక వరం పోలీస్ స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా కల్లూరు మండలం చిన్న కోరుకొండ గ్రామానికి చెందిన రెడ్డిచర్ల నరసింహ రాజు (39) భార్యతో విబేధాల కారణంగా తూర్పు గోదావరి జిల్లా గోకవరం వచ్చి కొంతకాలంగా నివాసం ఉంటున్నాడు. చుట్టు పక్కల గ్రామాల్లో హోమ్ నీడ్స్ వ్యాపారం చేస్తున్నాడు. ఈ క్రమంలో గోకవరం శివారున ఆర్అండ్ఆర్ కాలనీలో ప్లాట్‌ఫామ్‌పై అనుమానాస్పదస్థితిలో నరసింహరాజు మృతిచెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.

సులువుగా డబ్బు సంపాదించాలనుకుని నిలువునా మోసపోయి...

స్టాక్ మార్కెట్ వ్యాపారం మోజులో పడి

రూ.74 లక్షల సమర్పణ

రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు

రాజానగరం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ మాయాజాలం వలలో చిక్కుకుని అనేక మంది ఆర్థికంగా నష్టపోతున్నారు. సులువుగా డబ్బులు సంపాదించాలని ఓ వ్యక్తి స్టాక్ మార్కెట్ వ్యాపారం పేరుతో నిలువునా మోసపోయి ఏకంగా రూ.74 లక్షలు పోగొట్టుకున్నాడు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పోలీస్ స్టేషన్ పరిధిలోని కొంతమూరు గ్రామానికి చెందిన కాదా ఉమాకాంత్ ఆటోమోటివ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో అకౌంటెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో స్టాక్ మార్కెట్‌లో వ్యాపారం చేయాలనే ఉద్దేశంతో ఆగస్టు 17న ట్రేడింగ్ కోసం ఫేస్‌బుక్‌లో వెతికాడు. స్పావర్ట్ ట్రేడింగ్ యాప్ అనే పేరుతో లింక్ రాగా దానిని ఓపెన్ చేశాడు. మరుక్షణమే స్పావర్ట్ ట్రేడింగ్ పేరుతో వాట్సాప్ యాప్ ఓపెన్ అవ్వగా గ్రూప్‌లో యాడ్ అయినట్టు, స్టాక్ మార్కెట్లో పెట్టుబడి పెట్టాలంటే డీమేట్ అకౌంట్ ఓపెన్ చేయాలని మెసేజ్ వచ్చింది. దానిలో వివరాలు పూర్తి చేయడంతో అకౌంట్ క్రియేట్ కావడంతో దఫదఫాలుగా సుమారు పదకొండుసార్లు మొత్తం రూ.74,36,403 పెట్టుబడి పెట్టాడు. అనంతరం పెట్టిన అమౌంట్ ఫ్రీజ్ అయ్యిందని, విత్‌డ్రా చేయాలంటే మరో రూ.58,55,000 వేయాలని చెప్పడంతో మోసపోయాననే అనుమానంతో బాధితుడు రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్ఐ జివివి..సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు..

కొండవాగులో గల్లంతైన యువకుల మృతదేహాలు లభ్యం


యువకుల మృతదేహాల వద్ద పోలీసులు, స్థానికులు

రంపచోడవరం,అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా రంపచోడవరం మన్యం అందాలు తిలకించేందుకు వెళ్లిన కొండవాగులో స్నానానికి దిగి గల్లంతైన ఇద్దరు యువకుల మృతదేహాలు లభ్యమయ్యాయి. ఆదివారం కాకినాడ జిల్లా కరప మండలం ఉప్పలంక గ్రామానికి చెందిన ఓలేటి మణికంఠ, జనన్నాధపురానికి చెందిన పసుపులేటి దుర్గాప్రసాద్ మరో నలుగురు స్నేహితులతో కలిసి రంపచోడవరం మండలంలోని కొత్తపాకలు సమీపంలోని చాపరాయి వద్ద కొండవాగులో స్నానానికి దిగారు. వారిలో మణికంఠ (35), దుర్గాప్రసాద్(35) గల్లంతయ్యారు. మణికంఠ ఫైనాన్స్ వ్యాపారం చేస్తుండగా, దుర్గ ప్రసాద్ పూణెలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. పోలీసు, రెవెన్యూ అధికారులు ఆదివారం గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ మృతదేహాలు లభ్యం కాలేదు. సోమవారం గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహాలు లభ్యమవ్వడంతో ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాలను బంధువులకు అప్పగించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాలేజీ బస్సును ఢీకొన్న వ్యాన్

వ్యాన్ డ్రైవర్‌కు తీవ్రగాయాలు

ఆరుగురు విద్యార్థులకు స్వల్పగాయాలు




దెబ్బతిన్న బస్సు, వ్యాన్ ముందుభాగాలు

దేవరపల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటీ కాలేజీ బస్సును బొలేరే వ్యాన్ ఢీకొనడంతో వ్యాన్ డ్రైవర్‌కు తీవ్రగాయాలు కాగా బస్సులో ప్రయాణిస్తున్న 40మంది విద్యార్థుల్లో ఆరుగురికి స్వల్పగాయాలయ్యాయి. ఈ సంఘటన తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం కృష్ణంపాలెం గ్రామశివారులో సోమవారం ఉదయం జరిగింది. తాడేపల్లిగూడెం మండలం పెద తాడేపల్లిలో ఉన్న శ్రీవాసవి ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులతో దేవరపల్లి వైపు నుంచి తాడేపల్లి గూడెం వెళ్తున్న బస్సును విజయవాడ నుంచి కిరాణా సరుకులతో వస్తున్న వ్యాన్ వేగంగా ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. బస్సులో ఆరుగురికి గాయాలు కాగా దేవరపల్లి మండలం బంధపురం గ్రామానికి చెందిన వెంకటరమణకు నుదుటిపై గాయమైంది. గోపాలపురానికి చెందిన సరిపల్లి రోహిత్‌వెంకట సాయికి ముక్కు మీద గాయమైంది. వారికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స అందించారు. వ్యాన్ డ్రైవర్‌కు కాలు విరగడంతో రాజమండ్రి ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ వి.సుబ్రహ్మణ్యం తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కొత్తపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్ఐ జి.సురేంద్ర తెలిపారు. వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం పలివెల గ్రామశివారు నేరేపాలానికి చెందిన అరిగెల నాగభూషణం(34) వ్యవసాయ కూలీ. సోమవారం మధ్యాహ్నం మద్యం తాగి ఇంటికి వచ్చి తన గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. అతడి భార్య కేకలు వేస్తు పక్కవారిని పిలిచి గదిలోకి వెళ్లి చూడగా గదిలో ఉన్న ఫ్యాన్‌కు చున్నితో ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. స్థానికులు సాయంతో కొత్తపేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు మృతిచెందినట్టు తెలిపారు. ఎస్ఐ కేసు నమోదు చేశారు.

సామర్లకోట చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం

మళ్లీ తెరపైకి అంశం

కలెక్టర్‌కు 23 మంది కౌన్సిలర్ల సంతకాలతో వినతి అందజేత

సామర్లకోట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట మున్సిపల్ చైర్‌పర్సన్ వైసీపీకి చెందిన గంగిరెడ్డి అరుణపై అదేపార్టీకి చెందిన 23 మంది కౌన్సిలర్లు అవిశ్వాసం కోరుతూ కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్‌కు సోమవారం వినతిపత్రం అందజేసారు. ఇప్పటికే ఒక పర్యాయం చైర్‌పర్సన్‌పై స్వపక్ష కౌన్సిలర్లు కలెక్టర్‌కు ఈ ఏడాది 3 ఏప్రిల్ 2025న అవిశ్వాసం ప్రకటిస్తూ సంతకాలతో కూడిన ఫిర్యాదు చేశారు. దీనిపై వ్యూహాత్మకంగా వ్యవహరించిన చైర్‌పర్సన్ కోర్టును ఆశ్రయించి మరో పక్క తన చైర్‌పర్సన్ పదవికి రాజీనామా లేఖను మున్సిపల్ కమిషనర్‌కు మే 15న అందజేశారు. అప్పటికే చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ నోటీసులు జారీ చేయడంతో కలెక్టర్ ఆదేశాలతో మే15న కౌన్సిల్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రత్యేకాధికారిగా కాకినాడ ఆర్డీవో మల్లిబాబును కలెక్టర్ నియమించారు. సమావేశానికి హాజరైన 25 మంది కౌన్సిలర్లు చైర్ పర్సన్ అరుణపై అవిశ్వాసం ప్రకటించారు. అవిశ్వాస ఆరోపణలకు గురైన అరుణ రాజీనామా లేఖ ఉపసంహరించుకుంటున్నట్టు మున్సిపల్ కమిషనర్‌కు అదేరోజు మరో లేఖ అందజేశారు. అవిశ్వాస తీర్మానం నెగ్గినా సమస్య కోర్టులోబడి ఉన్నందున ఫలితం వెల్లడించరాదని ఆదేశించడంతో అప్పట్లో ఫలితాన్ని వెల్లడించలేకపోయారు. మరోవైపు అరుణ తాను విదేశాలకు వెళ్తున్నందున తిరిగి వచ్చేవరకూ తాను సమావేశాలకు హాజరుకాలేనని కమిషనర్‌కు లేఖ అందజేశారు. దీంతో నెలవారీ నిర్వహించాల్సిన 2సమావేశాలను అనిశ్చితపరిస్థితుల్లో నిర్వహించలేకపోయారు. తదనంతరం వైస్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న గోకిన సునేత్రాదేవిని ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌గా నియమిస్తూ ఆదేశాలు జూలై 28న రావడంతో 2 సమావేశాలు ఆమె అధ్యక్షతన నిర్వహించారు. ఈ నెల 1న విదేశాల నుంచి అరుణ తిరిగి స్వగ్రామం చేరుకోవడంతో చైర్‌పర్సన్ వివాదం తిరిగి తెరకెక్కింది. ఈ నెలాఖరున జరుగనున్న కౌన్సిల్ సాధారణ సమావేశం అరుణ అధ్యక్షతన నిర్వహించేందుకు వీలులేదంటూ మరొకసారి 23 మంది కౌన్సిలర్లు సంతకాలు పెట్టి కలెక్టర్‌కు సోమవారం వినతి అందజేశారు. ఈ విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా గత అవిశ్వాసతీర్మాన సమావేశం నిర్దేశాలకు లోబడి జరగలేదని తిరిగి రెండోదఫా ప్రత్యేక సమావేశం నిర్వహించాలని ఉత్తర్వులు జారీ అయినట్లు కమిషనరు శ్రీవిద్య తెలిపారు.

తునిలో మహిళ అదృశ్యంపై కేసు


అదృశ్యమైన సత్యవతి

తుని రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తునిలో మహిళ అదృశ్యంపై పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. బళ్లంకి సత్యవతి (46) గత కొంత కాలంగా మానసిక వ్యాధితో బాధపడుతున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారని ఎస్ఐ విజయ్‌బాబు పేర్కొన్నారు. ఈనెల 11న ఇంటి నుంచి ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయిందని, ఆచూకీ తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

కుమ్మరి వృత్తిదారుల సమస్యలు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తా

రాష్ట్ర కుమ్మరి శాలివాహన సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పేరేపి ఈశ్వర్


ధర్మవరంలో కుమ్మరి వృత్తిదారులను కలిసిన ఈశ్వర్

ప్రత్తిపాడు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కుమ్మరి వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళతామని రాష్ట్ర కుమ్మరి శాలివాహన సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పేరేపి ఈశ్వర్ చెప్పారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో సోమవారం ఆయన పర్యటించి కుమ్మరి కులవృత్తిదారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో అనంతపురం, పార్వతీపురం, అనకాపల్లి, కాకినాడ తదితర జిల్లాలో పర్యటించామన్నా రు. అన్ని చోట్ల ప్రధానంగా మట్టి, పనిముట్లు, పాత్రలు కాల్చే ఆములు, షెడ్లు, స్థలాలు, 50 ఏళ్ల పైబడిన కుల వృత్తిదారులకు పెన్షన్‌లు కావాలని వంటి సమస్యలు తమ దృష్టికి వచ్చాయని చెప్పారు. త్వరలో వీటిని ముఖ్యమంత్రి చంద్రబాబు వద్ద నివేదించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కుల వృత్తిదారులకు కార్పొరేషన్ చైర్మన్ హామీ ఇచ్చారు. ఆయన వెంట శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ భీమాబత్తుల సత్యనారాయణ, సంఘ నాయకులు స్వయంభూరపు వెంకటరమణ, అనకాపల్లి అప్పారావు, అనకాపల్లి నాగేశ్వరరావు, ఉబ్బిశెట్టి నారాయణరావు, పి.అప్పారావు, టిల్లంపూడి బాలాజీ తదితరులున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని...

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందినట్టు ఎస్ఐ జి.సురేంద్ర తెలిపారు. కొత్తపేట మండల పరిధి మోడేకుర్రు శివారు గొలకోటివారిపాలెంకు చెందిన మర్రి చినసత్యనారాయణ(65) ఆదివారం రాత్రి ఇంటి నుంచి రోడ్డుపై నడిచి వెళ్తుండగా వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుమారుడు శ్రీనివాసరావు ఫిర్యాదుతో ఎస్ఐ కేసు నమోదు చేశారు.

స్వదేశీ ఉత్పత్తుల ప్రదర్శన

అమలాపురంటౌన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): అమలాపురం శ్రీసత్యసాయి కల్యాణమండపంలో డ్వాక్రా మహిళలు, ఇతరులతో ఏర్పాటుచేసిన స్వదేశీ ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలను జిల్లా పంచాయతీ అధికారి డి.శాంతలక్ష్మి ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడారు.

అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్ జూబ్లీహిల్స్‌కు చెందిన మహేశ్వరరెడ్డి-అపర్ణ దంపతులు రూ.1,00,016 విరాళం సమర్పించారు. దాతలకు స్వామివారి చిత్రపటం అందజేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

సాగునీటి సంఘాలతో వ్యవసాయానికి నూతన శకం

తూర్పు డెల్టా వాటర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ శ్రీనివాస్


గొల్లవిల్లిలో రంగరాజుకోడు మీడియం డ్రెయిన్ పరిస్థితిని పరిశీలిస్తున్న గుబ్బల శ్రీనివాస్

ఉప్పలగుప్తం, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి):నీటి వినియోగదారుల సంఘాల ఏర్పాటుతో రాష్ట్రంలో వ్యవసాయానికి నూతన శకం ప్రారంభమైనట్టు గోదావరి తూర్పు డెల్టా వాటర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలో ఆయన పంటకాల్వలు, డ్రెయిన్లను పరిశీలించారు.కూనవరం సముద్రం మొగను పరిశీలించి మొగ ద్వారా ముంపునీరు సముద్రంలోకి పోయేందుకు తీసుకోవలసిన శాశ్వత చర్యలపై రైతుసంఘాల ప్రతినిధులతో చర్చించారు. కూనవరం మేజర్ డ్రెయిన్‌లో తవ్వకం పనులను డ్రెయిన్స్ డీఈఈ కిశోర్ వివరించారు. ఉప్పలగుప్తంలో పాయకరావుకోడు ఆధునికీకరణ ఆవశ్యకతను జనసేన నాయకుడు చిక్కం భీముడు చైర్మన్‌కు వివరించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన రైతు సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ కోనసీమలో ముంపు బెడదను అరికట్టేందుకు ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్‌తో సంప్రదించి తనవంతు కృషి చేస్తానన్నారు. ప్రాంతాల వారీగా నీటి సంఘాల చైర్మన్లు సమస్యలను వివరించారు. ఉప్పలగుప్తం నీటి పంపిణీ సంఘం చైర్మన్ దంగేటి చిట్టిబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అల్లవరం డీసీ చైర్మన్ దాట్ల గోపీరాజు, అగ్రిమిషన్ డైరెక్టర్ అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, ఉప్పలగుప్తం డీసీ వైస్ చైర్మన్ గుత్తుల శ్రీనివాస్, ప్రాజెక్టు కమిటీ మాజీ వైస్ చైర్మన్ సత్తి శ్రీను, కాట్రేనికోన డీసీ మాజీ చైర్మన్ అరిగెల నానాజీ, నీటిసంఘాల చైర్మన్లు నల్లా సత్యనారాయణ, బండారు వెంకటేశ్వరరావు, ఆకుల వెంకటరమణ, మోటూరి రవిశంకరకుమార్, పోలిశెట్టి ఉమామహేశ్వరరావు, సొసైటీ చైర్మన్ చిక్కం ఉమేష్, రైతు నాయకులు పెమ్మిరెడ్డి సత్యనారాయణ, అడబాల సత్యనారాయణ, సలాది శ్రీనివాస్, ఆకుల సూర్యనారాయణమూర్తి, పెయ్యల దుర్గారావు, రవణం మధు పాల్గొన్నారు.

జీఎస్టీ సంస్కరణలతో భారత్ ఆర్థికాభివృద్ధి

● ఎమ్మెల్యే ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ


ఎమ్మెల్యే ఆనందరావు ఆధ్వర్యంలో ప్లకార్డులతో ప్రదర్శన

అమలాపురం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం జీఎస్టీ 2.0సంస్కరణలతో ఆర్థికంగా కొత్త దశలోకి అడుగు పెట్టిందని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. కేవలం పన్నుల సంస్కరణలే కాదు దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపునిచ్చే మార్పు అన్నారు. సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌లో భాగంగా సోమవారం అమలాపురం ఎస్కేబీఆర్ కళాశాల నుంచి బస్టాండు వరకు జరిగిన మోటారుసైకిల్ ర్యాలీలో ఎమ్మెల్యే ఆనందరావుతో పాటు అనుచర గణం పాల్గొన్నారు. చిన్న వ్యాపారులు, రైతులు, మధ్య తరగతి ప్రజలు, ముఖ్యంగా గృహిణులకు ప్రధాని మోదీ ప్రభుత్వం తీసుకున్న ఈనిర్ణయం సుస్థిరాభివృద్ధికి దారి తీస్తుందన్నారు. ర్యాలీలో మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిరాజు, మీడియా కోఆర్డినేటర్ బోళ్ల సతీష్‌బాబు, కౌన్సిలర్లు యేడిద శ్రీను, నాయకులు ఆశెట్టి ఆదిబాబు, బోనం సత్తిబాబు, పలచోళ్ల పద్మనాభం, వేంకటేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ కంచిపల్లి అబ్బులు, మాజీ కౌన్సిలర్ దున్నాల దుర్గ పాల్గొన్నారు.

సీజేఐ గవాయ్‌పై దాడి యత్నంపై నిరసన


ధర్నా నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

అమలాపురం టౌన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై న్యాయవాది దాడికి యత్నించిన ఘటనను నిరసిస్తూ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణమాదిగ పిలుపు మేరకు కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. అనంతరం పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి సామ్రాట్ కేవీ మధుమాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సవరపు భైరవమూర్తి, జిల్లా నాయకులు నూటుకుర్తి సత్యనారాయణ, నేదునూరి రాజేష్, ఆకుమర్తి మోహన్, చుట్టుగుళ్ల సత్తిబాబు, మంద రామకృష్ణ, సత్తాల దుర్గారావు, ఆకుమర్తి ఆశీర్వాదం, నేదునూరి నతానియేలు, చుట్టుగుళ్ల నీలకంఠం, తెన్నేటి నగేష్, ఈతకోట నాగరాజు, పలివెల సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు కొత్త టీచర్లు

పి.గన్నవరం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులు ఆయా పాఠశాలల్లో బాధ్యతలు స్వీకరించారు. 12మంది ఎస్జీటీ ఉపాధ్యాయులు ఎంఈవో చింతా వీరభద్రానందానికి రిపోర్ట్ చేసి మండల పరిషత్ పాఠశాలల్లో జాయిన్ అయ్యారు. 11మంది స్కూల్ అసిస్టెంట్లు జడ్పీ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులకు రిపోర్ట్ చేసి పాఠశాలల్లో జాయిన్ అయ్యారు. నూతన ఉపాధ్యాయులకు ఎంఈవో, యూటీఎఫ్, ఎస్టీయూ నాయకులు స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.

నాణ్యమైన విద్య అందించాలి

అల్లవరం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కొత్తగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఎంఈవో కె.కిరణ్‌బాబు అన్నారు. ఉపాధ్యాయులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలన్నారు. మండలానికి ఏడు ఉపాధ్యాయ పోస్టులు మంజూరయ్యాయని తెలిపారు. ఎంఈవో కె.కిరణ్‌బాబును, మండల విద్యాధికారి-2 ఎస్.ఏడుకొండలును కొత్తగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులు మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈదరాడలో రోడ్లు వేయాలి

మామిడికుదురు, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): ఈదరాడగ్రామంలోని ఎస్సీ పేటలు కమ్మవారిలంక, కళింగులపేటకు రోడ్లు వేయాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ నాయకులు సోమవారం ప్రజాపరిష్కార వేదికలో వినతిపత్రాన్ని అందించారు. ఆయా పేటలకు 2006లో గ్రావెల్ రోడ్లు నిర్మించారని, ఇప్పటి వరకు ఆ రోడ్డును పట్టించుకోలేదన్నారు. ఐదు గ్రామాలకు అనుసంధానమై 500మీటర్ల రోడ్డును సిమెంటు, కాంక్రీటు రోడ్డుగా అభివృద్ధి పరచాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నూటుకుర్తి సత్యనారాయణ, యార్లగడ్డ రవి, నామవరపు చిరసత్యనారాయణ, ముస్కూడి బాలాజీ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

అల్లవరం అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఈనెల10న రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ బెండమూర్లంక అరగట్లపాలేనికి చెందిన టీవీఎస్ ఎక్సెల్ మోటారుసైకిల్‌పై వెళుతుండగా ట్రక్కు ఆటో ఢీకొనడంతో వెంకటలక్ష్మికి, ఆమె భర్తకు గాయాలయ్యాయి. కాకినాడ జీజీహెచ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వెంకటలక్ష్మి(58) సోమవారం మృతి చెందిందని ఎస్ఐ బి.సంపత్‌కుమార్ తెలిపారు.

గ్రామాల్లో ఆర్ఎస్ఎస్ శాఖలు


సమావేశంలో పాల్గొన్న ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

అయినవిల్లి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం మాగాం క్షత్రియ మండపంలో విజయదశమి ఉత్సవాలు ఘనంగా జరిపారు. వేటుకూరి సత్తిరాజు, శీలం బాలకృష్ణ ముఖ్య అతిథులుగా, ఆర్ఎస్ఎ సీనియర్ కార్యకర్త ఆంజనేయులు ముఖ్య వక్తగా పాల్గొన్నారు. గనిశెట్టి వెంకటేశ్వరరావు, వేటుకూరి శ్రీనివాసరాజు సహాయ శిక్షకులుగా పాల్గొని ధ్వజం ప్రమాణం, సూర్యనమస్కారాలు చేయించారు. ఈసందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో ఆర్ఎస్ఎస్ శాఖలను నిర్వహించాలని, ఆర్ఎస్ఎస్ కార్యక్రమాలను గ్రామాల్లోని ప్రతీ ఇంటికి కార్యకర్తలు తెలియజేయాలన్నారు. భరతమాతకు ప్రార్థన నిర్వహించి భరతమాతకు జైఅంటూ నినాదాలుచేశారు. బొక్కా ప్రసాద్, పెంటా సూరిబాబు, అడపా నాగేంద్రస్వామి, బొబ్బిలి విజయభారత్, సీహెచ్‌వెంకటేశ్వరరావు, గుర్రం వీరకృష్ణ, మల్లారి సూర్యమల్లికార్జునరావు, యనమల వెంకటరమణ, నల్లా సత్తిబాబు, మిద్దే నూతన రవిరాజ్, నల్లా మణికంఠ, తాడినాటి వెంకటేశ్వరరావు, ఆర్ఎస్ఎస్‌స్వయంసేవకులు, గ్రామ యువకులు, పెద్దలు, మహిళలు మోకా ఆదిలక్ష్మి, యనమదల రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

యానాంలో వర్షం.. చెరువుల్లా రహదారులు


జూనియర్ కళాశాల నుంచి డిగ్రీ కళాశాల వెళ్లే ప్రధాన రహదారిలో వర్షం నీరు

యానాం,అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): యానాంలో రోడ్లు, డ్రైన్ల పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది. చినుకు పడితే రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. సోమవారం ఉదయం గంటపాటు వర్షం కురిసింది. ద్రాక్షారామ రోడ్డులోని ట్యాక్సీస్టాండ్ నుంచి కాపులపాలెం జంక్షన్ వరకు ఉన్న ప్రధాన రహదారికి ఇరువైపులా వర్షం నీరు నిలిచిపోయింది. ట్యాక్సీస్టాండ్ వద్ద ఆలయం నిర్మాణ సమయంలో అధికారులు అక్కడున్న డ్రైనేజీని మూసివేయడంతో ఉదయం కురిసిన వర్షానికి నీరు నిలిచిపోయింది. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి డిగ్రీ కళాశాలకు వెళ్లే రహదారి చెరువును తలపిస్తుంది. సమీపంలోడ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ఈపరిస్థితులు తలెతుత్తున్నాయి. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల స్పందించి రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను చక్కదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.

ఉపాధ్యాయులకు యాప్‌ల భారం తగ్గించాలి


నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

ముమ్మిడివరం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు యాప్‌ల భారం తగ్గించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం మండలశాఖ సమావేశం డిమాండ్ చేసింది. ముమ్మిడివరంలో జి.ఉదయభాస్కరరావు అధ్యక్షతన సోమవారం ఎస్టీయూ మండలశాఖ సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయ సంఘ నేతలు మాట్లాడుతూ పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని, పీఆర్సీ కమిటీని వేయాలని వారు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులను బోధనేతర పనులకు వినియోగించరాదని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అనంతరం మండలశాఖ నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా వీవీవీ సత్యనారాయణ, గౌరవాధ్యక్షుడిగా జి.ఉదయభాస్కరరావు, ప్రధాన కార్యదర్శిగా జె.శ్రీధర్, ఆర్థిక కార్యదర్శిగా ఎ.పార్థశ్రీనివాస్, అదనపు ప్రధాన కార్యదర్శిగా బి.విజయలక్ష్మి, అభయ్ కన్వీనర్‌గా జె.సత్యనారాయణ, ఉపాధ్యాయవాణి కన్వీనర్‌గా ఎ.సుబ్రహ్మణ్యం, మహిళా కన్వీనర్‌గా పి.దుర్గమ్మ, జిల్లా కౌన్సిలర్లుగా ఎం.లక్ష్మణకుమార్, పి.హిమబిందు, కె.వెంకటలక్ష్మి, ఎన్‌జీవీఎన్‌కే నాయుడు, వి.సుధాకర్, కేఏస్వీ త్రిమూర్తులతో పాటు పలువురు ఎన్నికయ్యారు. ఎన్నికైన సభ్యులను ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పి.దొరబాబు, ప్రధాన కార్యదర్శి పల్లంరాజు, ఆర్థిక కార్యదర్శి ఎన్.సత్యనారాయణ తదితరులు అభినందించారు.

కార్తీక మాసం ఏర్పాట్లపై సమీక్ష

ఐ.పోలవరం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాస ఉత్సవాలు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్టు ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ దాట్ల రామకృష్ణంరాజు అన్నారు. ఉత్సవాలపై అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణతో కలిసి అర్చక, పురోహిత బృందంతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈనెల 22నుంచి నవంబరు 20వరకు కార్తీకమాస ఉత్సవాలు జరగనున్నాయి. నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు వీరేశ్వరస్వామి దర్శనానికి వచ్చే నేపథ్యంలో అందుకు తగ్గట్టుగా తగిన ఏర్పాట్లు చెయ్యాలని ఆయన సూచించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయాలన్నారు. ఆలయ ఆవరణలో తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించాలన్నారు. కార్తీక సోమవారాల్లో దాతల సహకారంతో మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. నెల రోజుల పాటు స్వామి వారికి జరిగే పూజలు, అభిషేకాలు తిలకించేందుకు ప్రత్యేక స్క్రీన్లు ఏర్పాటు చేస్తామన్నారు. రూ.3వేలు టికెట్టు తీసుకున్న భక్తుల సమక్షంలో నెల రోజులు స్వామి నిజరూప లింగానికి పంచామృతాభిషేకం జరుగుతుందన్నారు. నవంబరు 5న జ్వాలాతోరణం, ఆఖరి రోజు అమావాస్యకు దీపోత్సవం నిర్వహించనున్నట్టు తెలిపారు. ధర్మకర్తల మండలి సభ్యులు పాటి సీతామహాలక్ష్మి, ఆలయ పర్యవేక్షకుడు కటారి శ్రీనివాసరాజు, అర్చకులు యనమండ్ర సత్యసీతారామశర్మ, యనమండ్ర సుబ్బారావు, పేటేటి శ్యామలకుమార్, పురోహితుడు నాగాభట్ల రామకృష్ణమూర్తి, వేద పండితుడు గంటి సుబ్రహ్మణ్యశాస్త్రి, స్వస్తివాచకుడు నాగభట్ల రవిశర్మ పాల్గొన్నారు.

అప్పారావుకు రాజప్ప నివాళి

అమలాపురం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): సీనియర్ జర్నలిస్టుగా సుదీర్ఘకాలం సేవలందించిన అడపా అప్పారావు మృతి తీరని లోటని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. రోళ్లపాలెంలోని ఆయన స్వగృహంలో అప్పారావు చిత్రపటానికి రాజప్ప పూలమాలలువేసి నివాళులర్పించారు.



పథకాల వినియోగంపై కేంద్ర బృందం పరిశీలన


దుకాణం నిర్వహిస్తున్న డ్వాక్రా మహిళ నందికం పద్మావతితో మాట్లాడుతున్న కేంద్ర బృందం

ఉప్పలగుప్తం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల వినియోగం తీరుతెన్నులపై సోమవారం కేంద్ర బృందం భీమనపల్లి, పెదగాడవిల్లి గ్రామాల్లో ఆరా తీసింది. గోకులం షెడ్లు, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు, ఎన్ఆర్ఈజీఎస్ రహదారులను పరిశీలించింది. సామాజిక పెన్షన్‌దారులను కలిసి పెన్షన్ అందుతున్న తీరును ప్రశ్నించింది. డ్వాక్రా మహిళలు నడుపుతున్న దుకాణాలను తనిఖీ చేసింది. లబ్ధిదారులతో మాట్లాడి పథకాలకు అప్పు లభ్యత, రుణ చెల్లింపులపైఆరా తీసింది. పెదగాడవిల్లిలో డ్వాక్రా మహిళలు, ఉపాధి జాబ్‌కార్డుదారులు, పెన్షన్‌దారులు, గృహ లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. కేంద్ర పథకాల వివరాలు అందరికీ తెలిసేలా ప్రచారం జరుగుతుందా లేదా అని ఆరా తీశారు. ఈసందర్భంగా దుకాణాలు నిర్వహిస్తున్న మహిళలు విద్యుత్ చార్జీలపై రాయితీ ఇవ్వాలని కోరారు. పెన్షన్ రూ.5,000కు పెంచాలని లబ్ధిదారులు కోరారు. కేంద్ర బృందం ప్రతినిధులు ఉమేష్‌కుమార్‌రామ్, మయూర్‌వర్మ,సర్పంచ్‌లు పెయ్యల రాజ్‌కుమార్, గుద్దటి మహాలక్ష్మీనాగరాజు, ఎంపీడీవోలు డి.కృష్ణ, సరోవర్, డ్వామా ఏపీవీ రాంబాబు, పీఆర్ డీఈఈ రాజ్‌కుమార్, ఏఈ రాధాకృష్ణ, ఉపాధి ఏపీడీ ఎం.వీరబాబు, వెలుగు ఏపీఎం అయితాబత్తుల సురేంద్రబాబు, హౌసింగ్ ఈఈ సత్యనారాయణ, డిప్యూటీ ఎంపీడీవో కె.శ్రీనివాస్, ఈవోపీఆర్డీ పెట్టా నాగేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్ కేతాకు సన్మానం



రాజోలు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో త్యాగరాయ కన్వెన్షన్‌లో శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు ఆధ్వర్యంలో శెట్టిబలిజ సామాజిక వర్గం నుంచి ఉభయ గోదావరి జిల్లాల్లో నామినేటెడ్ పదవులు పొందిన కార్పొరేషన్ డైరెక్టర్లకు, మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్లకు సన్మాన కార్యక్రమం జరిగింది. బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్.సవిత, కార్మికశాఖ మంత్రి వాసంశెట్టిసుభాష్, నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సోమవారం రాజోలు ఏఎంసీ చైర్మన్ కేతా వెంకటలక్ష్మిని సన్మానించారు. పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం-అనంతకుమారి, రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, పెచ్చెట్టి చంద్రమౌళి, శెట్టిబలిజ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు ఇచ్చిన హామీలు అమలుచేయాలి


కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న గ్రామ, వార్డు వలంటీర్లు

అమలాపురం టౌన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో వైసీపీ ప్రభుత్వంలో పనిచేసిన వలంటీర్లకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్‌చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. వలంటీర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవడంతో పాటు నెలకు రూ.10వేలు చొప్పున వేతనం చెల్లిస్తామన్న హామీని అమలు చేయాలని నినాదాలు చేశారు. ధర్నాలో వలంటీర్స్ అసోసియేషన్ ప్రతినిధులు హేమ, సత్య, హిమబిందు, జె.చిట్టిబాబు, దేవ, కిరణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొనగా సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు తదితరులు సంఘీభావం తెలిపారు.

'ఆస్తిని తిరిగి రాయించాలి'

అమలాపురం టౌన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): అల్లవరం మండలం మొగళ్లమూరికి చెందిన వాసర్ల వెంకటనర్సయ్య-లక్ష్మి దంపతులు అండమాన్‌లో టైలరింగ్ వృత్తి చేసుకుని 2.18ఎకరాల భూమిని కూడబెట్టుకున్నారు. పిల్లలు లేకపోవడంతో బంధువుల ఇంట ఆడ బిడ్డను తెచ్చుకుని పెంచి వివాహం జరిపించారు. వెంకటనర్సయ్య పేరున ఉన్న భూమిని కుమార్తె అడగడంతో రాసిచ్చారు. అండమాన్‌లో ఉన్న షాపుల అద్దెలు వారే తీసుకుంటున్నారు. వృద్ధాప్యంతో పాటు అనారోగ్యం పాలవడంతో ఆ దంపతులు స్వగ్రామంలోనే ఉంటున్నారు. ఆస్తితో పాటు తమ నగదును సైతం తీసుకుని తమను పట్టించుకోవడం లేదని. కుమార్తె పేరిట రాసిన భూమిని తిరిగిరాయించాలని కోరుతూ కలెక్టరేట్‌లో అర్జీ అందించారు.

అప్రోచ్ వెడల్పు పెంచి రివిట్‌మెంట్ ఏర్పాటు చేయాలి

పి.గన్నవరం, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): లంక గ్రామాల వంతెన అప్రోచ్‌ను వెడల్పు పెంచాలని ఇంజనీర్ ఇన్ చీఫ్ బాలునాయక్ సూచించారు. ప్రస్తుతం ఉన్న పది మీటర్ల వెడల్పును 14 మీటర్లకు పెంచాలని ఆయన కోరారు. గంటిపెదపూడి, ఉడిమూడి లంకగ్రామాల రాకపోకలు నిమిత్తం నిర్మితమవుతున్న హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణాన్ని సోమవారం ఆయన పరిశీలించి అనంతరం మాట్లాడారు. అప్రోచ్ పెంచడంతో బలోపేతం చేయడానికి రివిట్‌మెంట్ పనులను, అలాగే గడ్డర్ పనులను కూడా త్వరితగతిన ప్రారంభించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. 2026 డిసెంబరు నాటికి వంతెన పనులు పూర్తిస్థాయిలో పూర్తి చేసి లంకగ్రామాలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన ఆదేశించారు. అనంతరం ప్రస్తుతం జరుగుతున్న గడ్డర్ పనులు, అప్రోచ్‌లను పరిశీలించి అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచనలు చేశారు. ఈఈ రామకృష్ణారెడ్డి, పంచాయతీరాజ్ డీఈఈ అన్యంరాంబాబు, ఏఈ హేమరవి సంపన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

యానాం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రతి మంగళ, శుక్రవారాలు సాయంత్రం4నుంచి 5గంటల వరకు ఫిర్యాదులు స్వీకరిస్తామని పరిపాలనాధికారి అంకిత్‌కుమార్ తెలిపారు.

నిల్వ, కుళ్లిన చేపలు స్వాధీనం

ముమ్మిడివరం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ 4వవార్డు మార్కెట్‌లో కుళ్లిన, నిల్వ ఉంచిన చేపలను విక్రయిస్తున్నారని కౌన్సిలర్లు, ప్రజలు కమిషనర్ పి.రవివర్మ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో కమిషనర్ పి.రవివర్మ శానిటేషన్ సిబ్బందితో వెళ్లి చేపల మార్కెట్‌లో తనిఖీలు నిర్వహించారు. చేపలు నిల్వచేసే రెండు ఐసు బాక్సులను గుర్తించి 15కిలోల కుళ్లిన చేపలను వారు స్వాధీనం చేసుకున్నారు. వాటిని ట్రాక్టరు సహాయంతో డంపింగ్ యార్డుకు తరలించి పూడ్చిపెట్టించారు. అధిక వర్షాలు కురుస్తున్న దృష్ట్యా చేపలు, మాంసం విక్రయ దుకాణదారులు నిల్వ ఉన్న వాటిని అమ్మరాదని, అలా ఎవరైనా అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శానిటరీ సెక్రటరీ, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

'కల్తీ మద్యాన్ని అరికట్టాలి'

పి.గన్నవరం,అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పర్మిట్ రూమ్స్ వెంటనే రద్దుచేసి కల్తీ మద్యాన్ని అరికట్టాలని వైసీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, మాజీఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కల్తీ మద్యానికి వ్యతిరేకంగా వైసీపీ శ్రేణులు పి.గన్నవరంలో సోమవారం నిరసన చేపట్టారు. తొలుత పోతవరం పార్టీ కార్యాలయం నుంచి త్రీరోడ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. తహశీల్దార్ పి.శ్రీపల్లవికి వినతిపత్రం అందించారు. పార్టీ మండల అధ్యక్షుడు యన్నా బత్తుల ఆనంద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మందపాటి కిరణ్ కుమార్, బూడిద వరలక్ష్మి, మద్దుల వరలక్ష్మి, పులపర్తి రాజారావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

రాజోలు, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో అర్హత సాధించి రాజోలు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో వి.త్రిపురసుధ ఇంగ్లీషు స్కూలు అసిస్టెంట్‌గా, బి.రామ్మోహన్ సంస్కృత ఉపాధ్యాయుడిగా బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా టీడీపీ రాజోలు నియోజకవర్గ ఇన్‌చార్జి గొల్లపల్లి అమూల్య సోమవారం వారికి పుష్పగుచ్ఛంఅందజేసి దుశ్శాలువాకప్పి సన్మానించారు. కార్యక్రమంలో రాజోలు ఏఎంసీ చైర్మన్ కేతా వెంకటలక్ష్మి, రాజోలు ఉప సర్పంచ్ పామర్తి రమణ, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ ఇస్మాయిల్, కడలి వెంకటరమణారావు, కోళ్ల వెంకన్న, రావి మురళీ పాల్గొన్నారు.

సమాచారహక్కు చట్టంపై అవగాహన పెంచుకోవాలి

ముమ్మిడివరం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): సమాచారహక్కు చట్టం ద్వారా ప్రభుత్వం నుంచి ఎటువంటి సమాచారాన్ని అయినా పొందవచ్చని సమాచార హక్కు చట్టం కార్యకర్త కుంచే చినబాబు పేర్కొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కన్వెన్షన్ హాలులో గుమ్మళ్ల శ్రీనివాస్‌సాగర్ అధ్యక్షతన సమాచారహక్కు చట్టం 20వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని దీవెన ఫౌండేషన్, పీపుల్ సర్వీస్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో చినబాబు మాట్లాడారు. చినబాబును వేదికపై ఘనంగా సత్కరించారు. పెనుమాల సుధీర్, కాశి వెంకటాచారి, కన్నీడి వెంకటేశ్వరరావు, తాటిపాక దుర్గబాబు పాల్గొన్నారు.

సర్వీసు రిజిష్టర్లు అందజేత

ముమ్మిడివరం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులకు ఏపీటీఎఫ్ జిల్లాశాఖ సర్వీసు రిజిష్టర్లు అందజేసింది. కమిని పంచాయతీ పరిధి వలసలతిప్ప ప్రాథమిక పాఠశాలలో డీఎస్సీలో ఎంపికైన ముగ్గురు ఉపాధ్యాయులకు ఏపీటీఎఫ్ జిల్లాశాఖ స్వాగతం పలికి అభినందనలు తెలియజేస్తూ వారు సర్వీసు రిజిష్టర్లు అందించారు. జిల్లా అధ్యక్షుడు ఎస్ఎన్ మునేశ్వరరావు సర్వీసు రిజిష్టర్లు అందించారు. జిల్లా కార్యదర్శి వి.రాజశేఖర్, స్థలదాత బీర చిన్నారావు, ఎన్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

అల్లవరం అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): టీడీపీ గోడి గ్రామ యువ నాయకుడు కడలి పృథ్వీ ఆధ్వర్యంలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈశిబిరాన్ని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రారంభించారు. కిమ్స్ వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, క్షత్రియకార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు, సర్పంచ్ తోట శ్రీదేవి, నరసింహారావు, ఎంపీటీసీ కాండ్రేగుల వాణీఅచ్యుతం, కడలి వెంకటేశ్వరరావు, పశ్చిమాల ఏడుకొండలు, జనసేన నాయకుడు గుర్రం కృష్ణ, తెలుగుయువత మండల అధ్యక్షుడు ముత్యాల బాబీ, మేడిద శంకరరావు, లూటుకుర్తి చిన్నా, రొక్కాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

16లోగా ఆక్వా చెరువులను క్రమబద్ధీకరించాలి

అల్లవరం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఆక్వా రైతులు ఈనెల16వ తేదీలోగా ఆక్వా చెరువులను క్రమబద్ధీకరించుకోవాలని తహశీల్దార్ వీవీఎల్ నరసింహారావు అన్నారు. ఆక్వాజోన్ రైతులు, నాన్‌ఆక్వాజోన్ రైతులు తమ ఆక్వా చెరువులను విధిగా క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు.

దీక్షలు చేస్తున్న వైద్యులకు సంఘీభావం

మామిడికుదురు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోరుతూ విజయవాడలో రిలే నిరాహార దీక్షలు చేస్తున్న వైద్యులకు సోమవారం పీహెచ్‌సీ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై సంఘీభావం తెలిపారు. వైద్యుల సమస్యలను పరిష్కరించాలంటూ, మేము మీ వెంటే ఉంటామంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో డీవీవీ ప్రసాద్, ఫార్మాసిస్ట్ జి.దుర్గాప్రసాద్, స్టాఫ్ నర్స్ డి.వెంకటలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ జి.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రజక ఐక్యవేదిక సభ్యుల సమావేశం

మామిడికుదురు, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): రజకఐక్యవేదిక సభ్యుల సమావేశం సోమవారం మామిడికుదురులో జరిగింది. నవంబరు 9న కార్తీక వనసమారాధన నిర్వహించడానికి తీర్మానం చేశారు. ఈవనసమారాధన రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తారన్నారు. గోగన్నమఠం శ్రీనివాసరావు, పసుపులేటి మహలక్ష్మీరావు, సంకా ఆంజనేయులు, అధికారపు వీరన్నబాబు పాల్గొన్నారు.

జీవన ఎరువుల వినియోగంతో భూసారం పెంపు

అంబాజీపేట, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): జీవన ఎరువులను పంటల్లో వినియోగించడం ద్వారా భూసారం పెరుగుతుందని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విద్యాలయం, జిల్లా వ్యవసాయ సాంకేతిక సలహా (ఏరువాక) కేంద్రం ప్రధానశాస్త్రవేత్త డాక్టర్ ఎం.నందకిషోర్ అన్నారు. పుల్లేటికుర్రులో జీవనఎరువుల విధానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ద్రవరూప జీవన ఎరువులు వరి పంటలో వాడే విధానంపై అవగాహన కల్పించారు. జీవన ఎరువుల వాడకంతో 25శాతం రసాయనిక ఎరువులు వినియోగం తగ్గించుకోవచ్చునన్నారు. సర్పంచ్ జల్లి బాలరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రావేప్ విద్యార్థులు, ఎఈవోలు, వీఏఏలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్ష

ముమ్మిడివరం, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరంఆర్టీసీ బస్టాండులోనికి బస్సుల రాకపోకలను పునరుద్ధరించాలని మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి చీకురుమెల్లి రవికుమార్ చేపట్టిన రిలే దీక్షలు సోమవారం నాటికి మూడో రోజుకు చేరుకున్నాయి. సోమవారం దీక్షా శిబిరాన్ని బీఎస్పీ నాయకులు వాకపల్లి భీమారావు, బడుగు భీమేశ్వరరావు, దాసరి శ్రీనివాస్, పందిరి శ్రీనివాస్ దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు.

నకిలీ మద్యంపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలి



అమలాపురంలో నిరసన తెలుపుతున్న వైసీపీ శ్రేణులు

అమలాపురంటౌన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యంపై తక్షణం సీబీఐ దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేస్తూ వైసీపీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ, ధర్నా నిర్వహించారు. నకిలీ మద్యం గుట్టు తేలేవరకు ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలని, సూత్రధారులు, పాత్రధారులను తక్షణం అరెస్టు చేయాలని నినాదాలు చేశారు. భట్నవిల్లిలోని మాజీమంత్రి పినిపే విశ్వరూప్ స్వగృహం వద్ద నుంచి ప్రారంభమైన నిరసన ర్యాలీ అమలాపురం నల్లవంతెన దిగువన ఉన్న ఎక్సైజ్‌శాఖ కార్యాలయం వరకు చేరుకుంది. వైసీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఎక్సైజ్‌శాఖ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఎమ్మెల్సీలు బొమ్మి ఇజ్రాయిల్, కుడుపూడి సూర్యనారాయణరావు, వైసీపీ వివిధ విభాగాల రాష్ట్ర, జిల్లా నాయకులు సంసాని బులినాని, గుత్తుల చిరంజీవిరావు, మట్టపర్తి నాగేంద్ర, కుడుపూడి భాగ్యలక్ష్మి, యిళ్ల శేషారావు, కొనుకు బాపూజీ, పందికి శ్రీహరి, కుడుపూడి బాబు, కుడుపూడి భరత్‌భూషణ్, వంగా గిరిజాకుమారి, దొంగ నాగసుధారాణి, జిన్నూరి బాబీ, రెడ్డి సత్యనాగేంద్రమణి, సరెళ్ల రామకృష్ణ, గొవ్వాల రాజేష్, ఈతకోట శ్రావణ్ పాల్గొన్నారు.

SHRIRAM Finance

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్ ప్లాట్ నెం 14A, సౌత్ ఫేజ్,ఇండస్ట్రియల్ ఎస్టేట్ గిండి,చెన్నై-600032.
నిర్వాహక కార్యాలయం: 6వ అంతస్తు(లెవెల్ 2),భవనం సంఖ్య 02,సెరం క్యూ పార్క్,జనరల్4/1,TTC, థానే బేలాపూర్ రోడ్,ఘన్సోలి,నవీ ముంబై-400710

గోల్డ్ వేలం మరియు ఇన్విటేషన్ నోటీసు

ఈ క్రింద పేర్కొన్న రుణగ్రహీతలు గోల్డ్ ఆభరణాలు హామీపై శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (SFL) నుండి పొందిన రుణముల యొక్క బకాయిలను తిరిగి చెల్లించవలసినదిగా నోటీసులు పంపడం జరిగినది. కానీ వారు తమ బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారు. ఈ హామీ పెట్టిన బంగారం ఆభరణాల యొక్క వేలంపాటను మేము వేలం వేస్తాము. ఈ వేలములో కంపెనీకి రావలసిన సొమ్ము కన్నా ఎక్కువ సొమ్ము వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీతకు చెల్లించటం జరుగుతుంది. తక్కువ వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీత నుండి చట్టపరమైన చర్యల ద్వారా వసూలు చేయడం జరుగుతుంది. SFL ఈ క్రింది ఖాతాలలో నేటివైనా వేలం నుండి తొలగించటానికి మరియు ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా వేలం తేదీని మార్చడానికి అధికారం కలిగి ఉంటుంది.

AUCTION DATE 22.10.2025,SHRIRAM FINANCE LTD,D.NO.3-2-38,UPSTAIR OF ING VYSYA BANK, K AGRAHARAM, AMALAPURAM-533201,

Loan A/C No	Customer Name	Loan A/C No	Customer Name
MNDP1PJ2504030003	ANASURI MANGA DEVI	MNDP1PJ2504100001	MANCHINASHETTI PANDU
MNDP1PJ2504030002	MANCHINASHETTI PANDU	RMCP1PJ2504050004	KASIVISWANATH GALIDEVARA
MLKPMPJ2504080002	MANGENA VISWANADHA SATYAN NA		

వేలం సమయం:11.00 AM మరింత సమాచారం కోసం, నిబంధనలు, షరతులు మరియు వేలంలో పాల్గొనడానికి రిజిస్టర్ చేసుకోవటానికి, ఆసక్తిగల కొనుగోలుదారుడు శ్రీ డి.రఘు రామరాజు ను సంప్రదించవచ్చు. సమయాభావముతో వేలము ఆ రోజు పూర్తి కాని యెడల మరుసటిరోజు అదే నియమ నిబంధనలకు లోబడి వేలము నిర్వహించబడును. కస్టమర్ మరణించినట్లయితే, వేలంకు సంబంధించిన అన్ని షరతులు అతని/ఆమె చట్టపరమైన వారసులకు వర్తిస్తాయి.

తేది: 13.10.2025
స్థలం: రాజమండ్రి

సం/- అధీకృత అధికారి
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

భూములను అప్పగించాలంటూ ధర్నా



వినతిపత్రం అందజేస్తున్న రైతుకూలీ సంఘం నాయకులు

కపిలేశ్వరపురం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): దళితులకు కేటాయించిన భూములను సర్వే చేసి అప్పగించాలంటూ సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏపీ రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో ధర్నా జరిపారు. జిల్లా కార్యదర్శి కొండా దుర్గారావు మాట్లాడుతూ కపిలేశ్వరపురం రెవెన్యూ విలేజ్ బ్లాక్‌లో 1986లో సుమారు 50 ఎకరాల భూమిని దళితులకు కేటాయించార న్నారు. ఈ భూమిని సాగులోకి తీసుకువచ్చిన తరువాత అగ్రకులాలకు వారు దళితులను భూముల నుంచి తరిమేశారని ఆరోపించారు. దీనిపై అనేకసార్లు అధికారులకు విన్నవించినా చర్యలు లేకపోవడంతో ధైర్యం చేసి భూముల్లో సాగుచేసే ప్రయత్నం చేస్తే పోలీసులు అక్రమ కేసులు పెట్టి హింసించారన్నారు. దీనిపై సర్వేచేసి భూములను ఆక్రమించుకున్న వారిపై కేసులు నమోదు చేసి దళితులకు భూమిని అప్పగించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీవో, డీటీలకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతుకూలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సాకా బాబూరావు, పల్లేటి నానిబాబు, కొడమంచిలి జాన్ తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెం డిపోను పరిశీలించిన ఈడీ



రావులపాలెం ఆర్టీసీ డిపోలో ప్రతిభ కనబరిచిన డ్రైవర్లు, కండక్టర్లను అభినందిస్తున్న ఈడీ చంగలరెడ్డి

రావులపాలెం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రావులపాలెం ఆర్టీసీ డిపోను ఈడీ చంగలరెడ్డి సోమవారం సందర్శించినట్లు డిపో మేనేజర్ వైవీవీఎస్ కుమార్ తెలిపారు. ఆర్టీసీ డిపోతో పాటు, కాంప్లెక్స్‌ను ఈడీ పరిశీలించారు. స్త్రీశక్తి పథకాన్ని బాగా అమలు చేస్తున్నారని సీఎం చంద్రబాబు అభినందించారన్న విషయాన్ని ఆయన తెలిపారు. డిపోలో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని ఈడీ అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జీరో బ్రేక్ డౌన్ ఉండాలని డ్రైవర్లకు మంచి బస్సులు ఇవ్వాలని సూచించారు. సెప్టెంబరులో రావులపాలెం డిపో జీరో బ్రేక్ డౌన్ 100 శాతం ఓఆర్ వచ్చినందుకు సిబ్బందిని అభినందించారు. వాడపల్లి ఆలయానికి ప్రయాణికులు ఇక్కడ నుంచే అధికంగా వెళుతున్న నేపథ్యంలో ప్రయాణికుల తాకిడి బాగా పెరుగుతోందన్నారు. డిపో షెడ్యూల్స్ వందకు పెరిగే అవకాశం ఉందని, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

కె.గంగవరం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోడీ జన్మదిన పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం కూటమి నాయకులు పామర్రు జూనియర్ కళాశాల విద్యార్థులకు ఆత్మనిర్భర్ భారత్ అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కనకాల ఆశిష్‌కుమార్, దుర్గసుకన్య, బొమ్ము సుజాత బహుమతులు కైవసం చేసుకున్నారు. వీరికి భారతీయ జనతా పార్టీ (బీజేపీ) మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి చంద్రరావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు అవసరాల రమణమూర్తి, నున్న సత్యనారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్వచ్ఛ అవార్డు గ్రహీతకు సత్కారం

ఆత్రేయపురం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం రాష్ట్ర స్వచ్ఛ అవార్డు గ్రహీత, లొల్ల సర్పంచ్ కాయల జగన్నాథం, పంచాయతీ కార్యదర్శి కృష్ణామాచార్యులు పారిశుధ్య కార్మికులను ఘనంగా సత్కరించారు. ఎంపీపీ కె.అన్నపూర్ణ, జడ్పీటీసీ బోనం సాయిబాబా, ఎంపీడీవో వెంకటరామన్, తహసీల్దారు రాజేశ్వరరావు అవార్డు గ్రహీత సిబ్బందికి దుశ్శాలువాతో సత్కరించారు.





రామచంద్రపురంలో బైక్ ర్యాలీలో పాల్గొన్న మంత్రి సుభాష్. పక్క చిత్రంలో ఆలమూరులో సూపర్ జీఎస్టీపై అవగాహన ర్యాలీ

జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు ఎంతో మేలు

• మంత్రి సుభాష్ బైక్ ర్యాలీ • పలు ప్రాంతాల్లో అవగాహన ర్యాలీలు

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్‌టీ...సూపర్ సేవింగ్స్‌పై సోమవారం రామచంద్రపురంలో అవగాహన బైక్ ర్యాలీ నిర్వహించారు. మంత్రి సుభాష్‌తో పాటు, కూటమి నాయకులు మున్సిపల్ కార్యాలయం నుంచి రాజగోపాల్ సెంటర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజు, కూటమి నాయకులు వాసంశెట్టి సత్యం, కంచుమర్తి బాబూరావు తదితరులతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలమూరులో అవగాహన ర్యాలీ

ఆలమూరు, (ఆంధ్రజ్యోతి): తగ్గించిన జీఎస్టీతో వినియోగదారులకు జరిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించేందుకు ఆలమూరులో సూపర్ జీఎస్టీ...సూపర్ సేవింగ్ ర్యాలీ నిర్వహించారు. ఆలమూరు వర్తక సంఘం, మండపేట కార్మికశాఖ అధికారి నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ నుంచి మెయిన్ రోడ్డులో ర్యాలీ జరిపారు. ఆయన మాట్లాడుతూ పలు రకాల వస్తువులపై 5 నుంచి 18 శాతం వరకు జీఎస్టీ తగ్గించారని ప్రతి ఒక్కరూ దీన్ని గుర్తించాలన్నారు. జీఎస్టీ తగ్గింపు వల్ల వినియోగదారులకు కలిగే ప్రయోజనాలు వివరిస్తూ అవగాహన ర్యాలీ చేశారు. కార్యక్రమంలో మండల వర్తక సంఘం నాయకులు వెత్సా నానాజీతోపాటు పలువురు వర్తకులు పాల్గొన్నారు.

రావులపాలెం (ఆంధ్రజ్యోతి): రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జీఎస్టీ 2.0 వల్ల కొత్త ఆర్థిక సంస్కరణలు అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనికి రాష్ట్ర కమర్షియల్ ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనరు డి.వెంకటేశ్వరరావు, కొత్తపేట చార్టర్డ్ అకౌంటెంట్ పల్లంరాజు, కె.నాగేశ్వరరావు హాజరై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ యు.రమేష్ బాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కె.గంగవరం (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు ఎంతో మేలు కలుగు తుందని టీడీపీ సీనియర్ నాయకులు వెంటూరు వీర్రాఘవులు చౌదరి, గొడవర్తి రామకృష్ణ అన్నారు. సోమ వారం వారు కోటిపల్లి గ్రామంలో తగ్గిన జీఎస్టీ వల్ల కలిగే ప్రయోజ నాలు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఇంటింటికి వెళ్లి జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై వివరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

జీఎస్టీపై విద్యార్థులకు అవగాహన

కొత్తపేట (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0 సంస్కరణలు భారత ఆర్థికాభివృద్ధిపై వాటి ప్రభావం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆధునిక పన్ను వ్యవస్థలో పారదర్శకత బాధ్యత, సమర్థత సాధనలో జీఎస్టీ 2.0 కీలకపాత్ర పోషిస్తుందని అసిస్టెంట్ ట్యాక్స్ కమిషనరు డి.వెంకటేశ్వరరావు విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి, చార్టర్డ్ అకౌంటెంట్లు పల్లంరాజు, నాగేశ్వరరావు, అధ్యాపకులు డాక్టర్ కె.సత్యనారాయణ, డాక్టర్ అంకంరావు, సీహెచ్ఎన్ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కె.గంగవరం మండలం కోటిపల్లిలో జీఎస్టీ తగ్గింపుపై ప్రచారం చేస్తున్న కూటమి నాయకులు

విద్యార్థులు కష్టపడి చదివితే ర్యాంకులు సాధ్యం



వైద్య విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ద్రాక్షారామ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల కష్టాన్ని దృష్టిలో పెట్టుకుని విద్యార్థులు విద్యాభ్యాసం చేయాలని పలువురు ఉపాధ్యాయులు అన్నారు. సోమవారం ద్రాక్షారామ జడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థిని ఇటీవల నీట్‌లో ఉత్తమ ర్యాంకు సాధించి కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో సీటు పొందిన గౌసియా షన్నును ద్రాక్షారామ జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. సామాన్య కుటుంబంలో పుట్టి నీట్‌లో ర్యాంకు సాధించిన ఆమెను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని హెచ్ఎం పేరిచర్ల శేఖర్ అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అరవ విస్సు ఖాజా మొహిద్దీన్, కోడి ప్రసాద్, మూర్తి, లక్ష్మీనారాయణ, రాజశేఖర్, మహాలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యాన్ని అరికట్టాలని సోమవారం రామచంద్రపురంలో వైసిపి నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్, పరిశీలకుడు చింతలపాటి శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ జరిపారు. అనంతరం ఎక్సైజ్ కార్యాలయానికి చేరుకుని ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబటి భవానీ, మండల కన్వీనర్లు పోలినాటి ప్రసాద్, పెట్టా శ్రీనివాస్, పిల్లి కృష్ణమూర్తి, పట్టణ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, అధికార ప్రతినిధి పెమ్మిరెడ్డి మురళీకృష్ణ, వైస్ ఎంపీపీలు, ఎంపిటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

కోట గ్రామ కార్యదర్శికి పదోన్నతి

కె.గంగవరం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలో కోట గ్రామ కార్యదర్శిగా పని చేస్తున్న సాకా రామకృష్ణకు డిప్యూటీ ఎంపీడీవోగా పదోన్నతి లభించింది. ప్రభుత్వం నుంచి దీనిపై ఉత్తర్వులు వెలువడ్డాయి. పదోన్నతి పొందిన ఆయన్ను ఎంపీడీవో ఎన్.శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ సురేంద్రనాథ్‌రెడ్డి, కార్యదర్శులు ముద్రగడ సత్యనారాయణ, కె.వి.వి. సత్యనారాయణ, గైరీ శంకర్, దుర్గాప్రసాద్, సూర్యగౌతమి, జెమ్మీ తదితరులు అభినందించారు.



విరాళం ఇచ్చిన దాతలకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

అన్నదాన పథకానికి విరాళం

ఆత్రేయపురం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో చేపడుతున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన మహేశ్వరరెడ్డి, అపర్ణ దంపతులు రూ.1,00,016 విరాళం ఇచ్చారు. దాతలకు స్వామివారి చిత్రపటంతో పాటు ప్రసాదాన్ని అందజేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తజనం అన్న ప్రసాదంలో పాల్గొన్నారు.



ఆలమూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు విరాళం

ఆలమూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఆలమూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఆర్వో ప్లాంట్ నిమిత్తం ఆలమూరుకు చెందిన కొత్తపేట నియోజకవర్గ రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వంటిపల్లి పాపారావు రూ.2లక్షల విరాళం అందించారు. కాలేజీకి ఆర్వో ప్లాంట్, జిరాక్స్ మిషన్‌తోపాటు పలు మరమ్మతుల నిమిత్తం ఈ మొత్తాన్ని అందించారు. ఈ నిధులతో నిర్మించిన ఆర్వో ప్లాంట్‌ను సోమవారం వంటిపల్లి పాపారావు చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ సరేష్‌రెడ్డి, పినపళ్ల సర్పంచ్ సంగిత సుభాష్, కాలేజీ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు గుణ్ణం వీర్రాజు, గారపాటి త్రిమూర్తులు, కాలా సాయిబాబు, చల్లా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కాలేజీ అభివృద్ధికి విరాళం అందించిన దాతను పలువురు అభినందించారు.

రిక్షాస్టాండ్‌లో తొలగించిన బోర్డు ఏర్పాటు

మండపేట, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండపేట బస్టాండ్ వద్ద వున్న రిక్షాస్టాండ్‌ను గత ప్రభుత్వంలో నిర్మించారు. అప్పటి ఉప ముఖ్యమంత్రి పిల్లి సుభాష్ చంద్రబోస్ హయాంలో నిధులు కేటాయించి పనులు పూర్తిచేయగా ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ తోట త్రిమూర్తులు ప్రారంభించారు. ఇటీవల అక్కడున్న బోర్డుని తొలగించి మహిళా బజార్‌ను ఏర్పాటు చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన బజారును తొలగించాలని యథాస్థానంలో తొలగించిన బోర్డును తిరిగి పెట్టాలని రిక్షా కార్మికులు అధికారులను కలిసి విజ్ఞప్తి చేసినా తిరిగి ఏర్పాటు చేయలేదు. దీంతో వారంతా స్థానిక కార్మిక నాయకులతోపాటు దూళి జయరాజు తదితరులను ఆశ్రయించి స్టాండ్‌లో దుకాణం ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకించారు. తొలగించిన రిక్షా స్టాండ్ బోర్డును ఏర్పాటు చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ తోట త్రిమూర్తులను ఆశ్రయించారు. సోమవారం ఆయన స్థానిక నాయకులు, కార్మికులతో కలిసి తొలగించిన బోర్డుస్థానంలో తిరిగి రిక్షా కార్మికుల బోర్డును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైసీపీనేతలు రెడ్డి రాధాకృష్ణ, పిల్లి శ్రీనువాస్, మున్సిపల్ కౌన్సిలర్‌లు, ఎమ్మార్పీఎస్ నాయకుడు దూళి జయరాజు, రిక్షా కార్మికులు చాపల సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

కంట్రోల్ రూముల ఏర్పాటు

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యోగుల ఆందోళన నేపథ్యంలో కరెంట్ సరఫరాకు అంతరాయం కలుగకుండా అన్ని డివిజన్, సర్కిల్ కార్యాలయాల్లో కంట్రోల్ రూములు ఏర్పాటు చేసినట్టు సూపరింటెండెంట్ ఇంజనీర్ బి.రాజేశ్వరి తెలిపారు. వినియోగదారులు 9490610098లో సంప్రదించాలన్నారు.

ట్రాన్స్‌కో ఉద్యోగుల తీరుపై ఆగ్రహం

• మండల సమావేశంలో పలు అంశాలపై పలువురు సర్పంచ్‌ల నిలదీత • పట్టించుకోకపోవడంపై అసంతృప్తి

ఆలమూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): సర్పంచులు, ప్రజా ప్రతినిధుల పట్ల ట్రాన్స్‌కో ఉద్యోగుల తీరు వర్ణించలేనిదని పలువురు సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలమూరు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు అధ్యక్షతన సోమవారం జరిగింది. సమావేశంలో పినపళ్ల, సందిపూడి సర్పంచ్‌లు సంగిత సుభాష్, తోట భవానీ తదితరులు ట్రాన్స్‌కో ఉద్యోగుల తీరును ఎండగట్టారు. పినపళ్లలో లైన్‌మన్‌ను నియమించమని ఏళ్ల తరబడి కోరుతున్నప్పటికీ పట్టించుకోవడం లేదని, సందిపూడి కాలనీలో ఐదేళ్లుగా విద్యుత్ సదుపాయం కల్పించమని కోరుతుంటే కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఉన్నతాధికారులకు వివరించి సమస్యలను పరిష్కరిస్తామని ఎంపీడీవో రాజు తెలిపారు. మండలంలో విద్యార్థుల సంఖ్యను బట్టి పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు ఉన్నారని, విద్యార్థుల సంఖ్యను పెంపుదల చేయడానికి ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని ఎంఈవో-2 ఎస్.రాజు కోరారు. మండలంలో అనేక గ్రామాల్లో ఇళ్లు నిర్మించుకుని బిల్లుల కోసం ఎదురు చూస్తున్నారని పినపళ్ల సర్పంచ్ సుభాష్ తెలిపారు. బిల్లుల అమోదం కోసం పంపించామని త్వరలో రానున్నట్టు హౌసింగ్ ఏఈ డి.శ్రీనివాస్ తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ కెజె.ప్రకాష్‌బాబు, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

2026-27 సంవత్సరానికి మిగులు బడ్జెట్: మండల ప్రజా పరిషత్ 2026-27 సంవత్సరానికి సంబంధించి రూ.18,875 మిగులుతో బడ్జెట్‌ను ఎంపీడీవో ఎ.రాజు ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్‌లో రూ.83,44,23,750 ఆదాయంగా రూ.83,44,04,875 వ్యయంగా నిర్ణయించారు. వచ్చే ఆదాయ, వ్యయాలను సభ్యులకు వివరించగా సమావేశం ఏకగ్రీవంగా బడ్జెట్‌ను ఆమోదించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ తోరాటి

అధికారుల గైర్హాజర్‌పై మండిపాటు

• వాడివేడిగా మండల పరిషత్ సమావేశం • అపరిష్కృత సమస్యలపై ధ్వజం

ఆత్రేయపురం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించడంలో మండలస్థాయి అధికారులు సమావేశానికి గైర్హాజరు కావడంపై ప్రజా ప్రతినిధులు ధ్వజమెత్తారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కుండా అన్నపూర్ణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సభలో ప్రజా ప్రతినిధులు అనేక సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. పంచాయతీలకు రావాల్సిన స్టాంప్ డ్యూటీ బకాయిలు జమ కాలేదని, గత సమావేశంలో ప్రస్తావించిన పలు సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని నార్కెడిమిల్లి సర్పంచ్ పాలా నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. తమ గ్రామంలో లైన్‌మన్ అందుబాటులో ఉండటం లేదని ఫోన్ చేసినా స్పందించడం లేదంటూ సంబంధిత అధికారులపై ఆయన మండిపడ్డారు. వసంతవాడ గ్రామంలోని రైతుల పంటపొలాల్లో బోరుబావులకు ఉచిత కనెక్షన్లు దరఖాస్తు చేసుకున్నా మీటర్లు ఇవ్వడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారని వైస్ ఎంపీపీ బంగార్రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెలిచేరు జడ్పీ హైస్కూల్‌లో అదనపు తరగతి గదుల భవన నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయిందని విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారంటూ ఆ గ్రామ సర్పంచ్ వేముల శ్రీనివాస్ ఆ శాఖ అధికారులపై మండిపడ్డారు. అమలాపురం కాలువ వెంబడి ర్యాలి వద్ద పచ్చని చెట్లను నరికి కలపను బట్టీలకు తరలించారని పలువురు ఆరోపించారు. మురుగునీటి వ్యవస్థ సక్రమంగా పని చేయడం లేదని సైఫాన్లు నిర్మించి ఉపయోగం ఏమిటని జడ్పీటీసీ బోనం సాయిబాబా సంబంధిత అధికారులపై మండిపడ్డారు. సభ్యులు అడిగిన సమస్యలపై అధికారులు వివరణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరామన్, తహసీల్దారు రాజేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అన్నపూర్ణ

వినియోగదారులకు మెరుగైన సేవలకు ప్రాధాన్యం

జోనల్ మేనేజర్ నాయక్

మండపేట, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే సెంట్రల్ బ్యాంకు ఆఫ్ ఇండియా లక్ష్యమని బ్యాంకు జోనల్ మేనేజర్ ధారానాయక్ అన్నారు. మండపేటలో నూతన శాఖకు వచ్చిన ఆయన మీడియాతో పలు అంశాలు మాట్లాడారు. మండపేటలో వున్న బ్యాంకు శాఖలో రూ.100 కోట్లమేర వ్యాపారం జరుగుతోందన్నారు. కోళ్ల పరిశ్రమ, రైస్‌మిల్లులకు రుణాలు ఇస్తామన్నారు. సమావేశంలో ఆర్ఎం రమణమూర్తి, స్థానిక బ్యాంకు మేనేజర్ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సెంట్రల్ బ్యాంకు ఆఫ్ ఇండియా జోనల్ మేనేజర్ దారాసింగ్ నాయక్, రీజనల్ మేనేజర్ రమణమూర్తి

రెవెన్యూ ఉద్యోగులకు అండగా ఉంటా

ద్రాక్షారామ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ ఉద్యోగులకు అండగా ఉంటానని రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రామచంద్రపురం డివిజన్ అధ్యక్షుడు బండి మృత్యుంజయరావు అన్నారు. ఇటీవల ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఎన్నికైన తహసీల్దార్ బండి మృత్యుంజయరావు, అసోసియేట్ ప్రెసిడెంట్ మేడిశెట్టి హరిశ్చంద్ర ప్రసాద్, ఉపాధ్యక్షులు పంపన రామారావు, డివిజన్ కోశాధికారి పి.శ్రీరామ్ ప్రసాద్, జాయింట్ సెక్రటరీ ఎస్.మురళీలను తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, వీఆర్‌వోలు, వీఆర్ఏలు, డీలర్లు సత్కరించారు. సమావేశంలో డీటీ వి.మాధురి, ఆర్ఐ వి.సత్యదేవ్‌ప్రసాద్, వీఆర్‌వో ల రాష్ట్ర ప్రచార కార్యదర్శి మద్దాల బాపూజీ తదితరులు మాట్లాడారు. ఎంఎస్‌వో సోనిప్రియ, వీఆర్‌వోల అసోసియేషన్ నాయకులు సాయి ప్రతిమ, వీఆర్‌వోల మండల అధ్యక్షుడు పైడిమల్ల సత్తిబాబు, కార్యదర్శి చీకట్ల ఆంజనేయులు, ఉపాధ్యక్షులు కాకినాడ సత్యవతి, డీలర్ల సంఘం అధ్యక్షులు శీలం గంగరాజు, వెచ్చా రామకృష్ణ, దేవ గణేష్ (పండు), వీఆర్ఏల అసోసియేషన్ మండల అధ్యక్షుడు కొనమంచిలి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణమూర్తి సేవలు ప్రశంసనీయం

కపిలేశ్వరపురం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : అంగరలో కమ్యూనిస్టు పార్టీ నాయకుడు తోరాటి లక్ష్మణమూర్తి జయంతిని సోమవారం నిర్వహించారు. స్థానిక తోరాటి లక్ష్మణమూర్తి విజ్ఞాన కేంద్రం వద్ద పలువురు స్మారక స్థూపానికి నివాళులర్పించారు. అనంతరం అంగర గాంధీ సెంటర్‌లోని లక్ష్మణమూర్తి విగ్రహానికి నివాళులర్పించారు. అంగర, పడమర ఖండ్రిక గ్రామాల సర్పంచ్‌లు వాసా కోటేశ్వరరావు, తిరునాతి ఆదిలక్ష్మి వెంకటేశ్వరరావు (బుజ్జి), ఎంపీహెచ్ఈవో జుత్తుగ మల్లికార్జునుడు తదితర నాయకులు మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ప్రాణాలర్పించిన ఆయన ఆదర్శనీయుడన్నారు. కార్యక్రమంలో కరాటపు కండేశ్వరరావు, తోరాటి బాబులు, పెద్దింశెట్టి సూర్యచంద్రరావు, ముత్తా అబ్బు, మేడేపల్లి కొండ, యానాల సీతారామయ్య, పసలపూడి కృష్ణ, ఎం.చిన్న, వై. సుబ్బారావు, డి.సత్తిపండు, తాపీమేస్త్రీలు, ఆటో యూనియన్ నాయకులు, పంచాయతీ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధన

కపిలేశ్వరపురం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం దేవీ సెంటర్‌లో సోమవారం అన్నసమారాధన నిర్వహించారు. దేవీ శరన్నవరాత్రుల ముగింపు సందర్భాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అన్న సమారాధనలో గ్రామస్థులతో పాటు వివిధ గ్రామాల ప్రజలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎక్కడా అసౌకర్యం రాకుండా నిర్వాహకులు అన్ని చర్యలు తీసుకున్నారు.

జొన్నాడ విద్యార్థి ప్రతిభ



విజేతగా నిలిచిన జొన్నాడ విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

ఆలమూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం జొన్నాడకు చెందిన విద్యార్థి రాష్ట్రస్థాయి వుషూ పోటీల్లో ప్రతిభ కనబరిచి పలు విభాగాల్లో బహుమతులు సాధించినట్టు మార్షల్ ఆర్ట్స్ మాస్టర్ కె.సత్తిబాబు తెలిపారు. రాజమహేంద్రవరం ఎస్‌కెవీటీ కాలేజీలో ఏపీ గవర్నమెంట్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయిలో వుషూ పోటీల్లో జొన్నాడకు చెందిన కర్రి నాగసంతోష్ 60 కిలోల విభాగంగా గోల్డ్‌మెడల్ సాధించారు. ఈనెల 28న శ్రీనగర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపిక అయినట్టు సత్తిబాబు తెలిపారు. జొన్నాడలో సోమవారం జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థి నాగసంతోష్, మాస్టర్ సత్తిబాబులను నాయకులు తాడి శ్రీనివాసరెడ్డి, గొడవర్తి దుర్గాప్రసాద్ తదితరులు అభినందించారు.



మాట్లాడుతున్న ఆర్డీవో దేవరకొండ అఖిల

అనుమతించిన ప్రదేశాల్లోనే మందుగుండు విక్రయాలు నిర్వహించాలి

ఆర్డీవో అఖిల

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): అనుమతించిన ప్రదేశాల్లోనే మందుగుండు విక్రయాలు జరపాలని ఆర్డీవో దేవరకొండ అఖిల అన్నారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో డివిజన్ పరిధిలో మందుగుండు సామగ్రి విక్రయాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భద్రతా చర్యల నిమిత్తం తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సీఐలు, అగ్నిమాపకదళ అధికారులు, కార్మికశాఖ, వాణిజ్య పన్నుల అధికారులతో డీఎస్పీ రఘువీర్‌తో కలసి సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆర్డీవో మాట్లాడుతూ రానున్న దీపావళిని పురస్కరించుకుని మందుగుండు సామగ్రి విక్రయాల కోసం తాత్కాలిక లైసెన్సులు ఇస్తామన్నారు. డీఎస్పీ రఘువీర్ మాట్లాడుతూ విక్రయ దుకాణాల్లో పిల్లలు, వృద్ధులు, దివ్యాంగులు పని చేయరాదన్నారు. అగ్నిమాపకశాఖ అధికారులు మాట్లాడుతూ మందుగుండు సామగ్రి విక్రయ దుకాణంలో నీళ్ల డ్రమ్ములు, ఇసుక, బకెట్లు, అగ్నిమాపక యంత్రం తప్పకుండా ఏర్పాటు చేయాలన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలం

మండపేట, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రాయవరంలో ఇటీవల జరిగిన బాణసంచా ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు నష్టపరిహారం ప్రకటించటంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైసీపీ మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆరోపించారు. సోమవారం వైసీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఘటనా స్థలాన్ని మంత్రి అనితతో పాటు, స్థానిక ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు పరిశీలించినప్పటికీ పరిహారం ప్రకటించడంలో జాప్యం జరగటం ఏమిటని ప్రశ్నించారు. తక్షణమే బాధిత కుటుంబాలకు సాయం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రస్థాయి చెకుముకి సైన్సు సంబరాల బ్రోచర్ విడుదల

ఆత్రేయపురం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి చెకుముకి సైన్సు పోటీల బ్రోచర్‌ను సోమవారం ఎంఈవోలు వరప్రసాదరావు, సత్యనారాయణ ఆవిష్కరించారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు శ్యామ్ జాదుగర్ మాట్లాడుతూ అక్టోబరు 18వ తేదీ నుంచి మండలస్థాయి పాఠశాలలో, నవంబరు 1 నుంచి జిల్లాస్థాయిలో, 23 నుంచి రాష్ట్రస్థాయిలో డిసెంబరు 12 13, 13 తేదీల్లో చెకుముఖి సైన్సు సంబరాలు నిర్వహించుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అనుమతి ఇచ్చిందన్నారు. చిన్నారుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు పోటీతత్వాన్ని అలవర్చుకునేందుకు పాఠశాలలో ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. యూటీఎఫ్ గౌరవ అధ్యక్షులు రవి, యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామకృష్ణ, సుధాకర్, వాసుకి తదితరులు పాల్గొన్నారు.

SHRIRAM Finance

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్ ప్లాట్ నెం 14A, సౌత్ ఫేజ్,ఇండస్ట్రియల్ ఎస్టేట్ గిండి,చెన్నై-600032.
నిర్వాహక కార్యాలయం: 6వ అంతస్తు(లెవెల్ 2),భవనం సంఖ్య 02,వీరం క్యూ పార్క్,జనరల్4/1,TTC, థానే బేలాపూర్ రోడ్,ఘన్సోలి,నవీ ముంబై-400710

గోల్డ్ వేలం మరియు ఇన్విటేషన్ నోటీసు

ఈ క్రింద పేర్కొన్న రుణగ్రహీతలు గోల్డ్ ఆభరణాలు హామీపై శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (SFL) నుండి పొందిన రుణముల యొక్క బకాయిలను తిరిగి చెల్లించవలసినదిగా నోటీసులు పంపడం జరిగినది. కానీ వారు తమ బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారు. ఈ హామీ పెట్టిన బంగారం ఆభరణాల యొక్క వేలంపాటను మేము వేలం వేస్తాము. ఈ వేలములో కంపెనీకి రావలసిన సొమ్ము కన్నా ఎక్కువ సొమ్ము వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీతకు చెల్లించటం జరుగుతుంది. తక్కువ వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీత నుండి చట్టపరమైన చర్యల ద్వారా వసూలు చేయడం జరుగుతుంది. SFL ఈ క్రింది ఖాతాలలో వేటినైనా వేలం నుండి తొలగించటానికి మరియు ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా వేలం తేదీని మార్చడానికి అధికారం కలిగి ఉంటుంది.

AUCTION DATE 22.10.2025,SHRIRAM FINANCE LTD,D.NO.3-2-38,UPSTAIR OF ING VYSYA BANK, K AGRAHARAM, AMALAPURAM-533201,

Loan A/C No	Customer Name	Loan A/C No	Customer Name
MNDP1PJ2504030003	ANASURI MANGA DEVI	MNDP1PJ2504100001	MANCHINASHETTI PANDU
MNDP1PJ2504030002	MANCHINASHETTI PANDU	RMCP1PJ2504050004	KASIVISWANATH GALIDEVARA
MLKPMPJ2504080002	MANGENA VISWANADHA SATYAN NA		

వేలం సమయం:11.00 AM మరింత సమాచారం కోసం, నిబంధనలు, షరతులు మరియు వేలంలో పాల్గొనడానికి రిజిస్టర్ చేసుకోవటానికి, ఆసక్తిగల కొనుగోలుదారుడు శ్రీ డి.రఘు రామరాజు ను సంప్రదించవచ్చు. సమయాభావముతో వేలము ఆ రోజు పూర్తి కాని యెడల మరుసటిరోజు అదే నియమ నిబంధనలకు లోబడి వేలము నిర్వహించబడును. కస్టమర్ మరణించినట్లయితే, వేలంకు సంబంధించిన అన్ని షరతులు అతని/ఆమె చట్టపరమైన వారసులకు వర్తిస్తాయి.

తేది: 13.10.2025
స్థలం: రాజమండ్రి

సం/- అధీకృత అధికారి
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్